
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం 20 సెప్టెంబరు 2025
5

రావాల్సినంత రాలే.. కొరత తీరలే..



పందిళ్లపల్లి ర్యాక్ పాయింట్‌కు చేరిన యూరియా(ఫైల్)

» ఉమ్మడి జిల్లాలో యూరియా కోసం రైతుల అవస్థలు
» కొన్ని ప్రాంతాల్లోనే సమస్య అధికం
» ఖమ్మం జిల్లాకు కావాల్సింది 41వేల మెట్రిక్ టన్నులు.. వచ్చింది 30వేలు..

ఖమ్మం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఈ ఏడాది వానాకాలం సాగుకు ఉపక్రమించిన రైతులకు యూరియా కొరత అవస్థలు తెచ్చిపెడుతోంది. వర్షాలు సానుకూలంగా పడటం.. సాగు ఆశాజనకంగా ఉండడంతో సంతోషం వ్యక్తం చేసిన అన్నదాతలకు యూరియా రూపంలో కష్టాలు ఎదురవుతున్నాయి. వరుస వానలతో వరితో పాటు ఇతర పంటలకు కూడా యూరియా అవసరం ఏర్పడింది. అయితే గతేడాది సీజన్‌తో పోలిస్తే కేంద్రంనుంచి జిల్లాకు రావాల్సిన ఎరువులు రావాల్సినంత రాకపోవడంతో కొరత తీరని పరిస్థితి కనిపిస్తోంది. రైతులు సొసైటీలు, రైతువేదికల వద్ద, ఎరువుల దుకాణాల ఎదుట పడిగాపులు కాస్తున్నారు. కొన్ని మండలాల్లో యూరియా డిమాండ్ తగ్గినా ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు అధికంగా ఉన్నచోట యరియా వినియోగం అధికంగా ఉంది. పత్తి, మొక్కజొన్న, వరి, మిర్చి పంటలతో పాటు కూరగాయలు, పండ్లతోటలు అన్ని పంటలకు ప్రస్తుతం యూరియా వేసే సమయం కావడంతో సమస్య జటిలమవుతోంది. కాంప్లెక్స్‌కు సంబంధించి ఏ ఎరువు వేసినా అందులో యూరియా తప్పనిసరి కావడంతో కట్ట దొరికినా ఎకరం పంటకు వేయవచ్చని రైతులు ఆరాటపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో కారేపల్లి, కొణిజర్ల, వైరాతోపాటు జూలూరుపాడు, ఏన్కూరు, ఇల్లెందు, టేకులపల్లి.. ఇలా పత్తిపంట అధికంగా సాగుచేస్తున్న చోట యూరియాకోసం రైతలు పరుగులు తీస్తున్నారు. వరిసాగు కూడా ఉమ్మడి జిల్లాలో భారీగా ఉంది. ప్రస్తుతం పొట్టదశలో ఉండడంతో రైతులు యూరియాను అధికంగా వేస్తున్నారు. అధిక దిగుబడులకు యూరియా అవసరమని భావించి వేస్తుండడంతో ఇంకా డిమాండ్ తగ్గడంలేదు.

ఈ ఏడాది తగ్గిన యూరియా రాక..

గతేడాది వానాకాలం సీజన్‌లో ఖమ్మం జిల్లాకు 34,522మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. ఇక ఈఏడాది 41వేల మెట్రిక్‌టన్నులు రావాల్సి ఉండగా. ఇప్పటి వరకు 30,200మెట్రిక్‌టన్నులు వచ్చింది. దీంతో ఇంకా యూరియా కొరత తీరలేదు. వాస్తవానికి ఈనెలాఖరుతో వానాకాలం సాగు కాలం ముగుస్తుంది. అక్టోబరు 1 నుంచి యాసంగి సీజన్

(మిగతా 8వ పేజీలో)

యూరియా వెతలు.. రైతుల బారులు..

» పంపిణీ కేంద్రాల వద్ద గంటల తరబడి ఎదురుచూపు
» కారేపల్లిలో ఏవోను చుట్టుముట్టిన అన్నదాతలు
» ఆందోళనతో సొమ్మసిల్లిన ఏవో.. ఆస్పత్రికి తరలింపు
» కొణిజర్లలో అధికారులను నిలదీసిన రైతులు

7



యూరియా కోసం కారేపల్లి సొసైటీ వద్దకు భారీగా తరలివచ్చిన రైతులు

పందిళ్లపల్లి ర్యాక్ నుంచి యూరియా పంపిణీ

చింతకాని, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల రైతుల అవసరాల కోసం 3,001 మెట్రిక్ టన్నుల యూరియా శుక్రవారం పందిళ్లపల్లి ర్యాక్ పాయింట్‌కు చేరిందని టెక్నికల్ ఏవో పవన్‌కుమార్ తెలిపారు. ఇందులో ఖమ్మం జిల్లాకు 1,501, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 300, మహబూబాబాద్ జిల్లాకు వెయ్యి, సీఆర్‌పీ ఖమ్మానికి 200 మెట్రిక్ టన్నులు యూరియాను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆ కోటా యూరియా బస్తాలను ఆయా జిల్లాలోని సొసైటీలకు పంపిణీ చేశామని ఏవో వెల్లడించారు.



వైరా రిజర్వాయర్

వణికిన వైరాకు 20ఏళ్లు

» అప్పట్లో రెండు రోజుల్లోనే 46 సెంటీమీటర్ల వర్షపాతం
» నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
» భయం గుప్పిట వైరా వాసులు
» శాంతి భద్రతల సమస్యగా మారిన ముంపు రాజకీయం
» 125మీటర్ల పొడవుతో కొత్త అలుగు నిర్మాణం

6

రామాలయ అభివృద్ధికి ప్రాధాన్యం

» కమిషనర్ కార్యాలయంతో ఈ-ఆఫీసును అనుసంధానిస్తాం
» రామయ్య భూముల్లో ఆక్రమణలు జరిగితే సహించేది లేదు
» గోదావరి పుష్కరాలకు 1.50కోట్ల మంది వస్తారనే అంచనాతో ఏర్పాట్లు
» భక్తులకు రుచికరమైన అన్నప్రసాదం అందేలా చర్యలు

‘ఆంధ్రజ్యోతి’తో దేవస్థానం ఈవో కొల్లు దామోదర్‌రావు



భద్రాచలం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం పుణ్యక్షేత్రాన్ని దర్శించేందుకు తరలివచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పిస్తూ ఆలయ అభివృద్ధికి అధిక ప్రాధాన్యమివ్వనున్నట్లు భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో కొల్లు దామోదర్‌రావు తెలిపారు. దేవస్థానంలో సిబ్బంది కొరత ఉన్నా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నామని, ఉన్న సిబ్బందితో పరిపాలన కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం ఆయన ‘ఆంధ్రజ్యోతి’తో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా దేవస్థానం పరిధిలోని పలు అంశాలపై మాట్లాడిన ఆయన (మిగతా 6వ పేజీలో)

అడ్డగోలుగా ‘సర్దేశారు’!

» నిబంధనలకు విరుద్ధంగా సర్దుబాటు
» పట్టణ కేంద్రానికి మారుమూల ప్రాంత ఉపాధ్యాయులు
» పైరవీకారులకు అండదండలు అందించిన అధికారులు
» జిల్లాలో మొత్తం 311 మంది ఉపాధ్యాయుల సర్దుబాటు

ఖమ్మం ఖానాపురం హవేలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం ప్రభుత్వం వెలువరించిన మార్గదర్శకాలను జిల్లా విద్యాశాఖ తుంగలో తొక్కిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగానే నిబంధనలకు విరుద్ధంగా మారుమూల ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు ఉపాధ్యాయులను అడ్డగోలుగా సర్దుబాటు చేశారన్న విమర్శలు వినవస్తున్నాయి. అదే మండలంలో.. లేని పక్షంలో పక్క మండలంలో సర్దుబాటు ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా.. ఇందుకు పూర్తి భిన్నంగా మండలాలు దాటించి 60, 70 కిలోమీటర్ల వరకు సర్దుబాటు చేశారని టీఎస్ యూటీఎఫ్ జిల్లా నాయకులు బాహటంగానే ఆరోపిస్తున్నారు. రాజకీయ అండదండలు పలుకుబడి కలిగిన వారికి మంచి స్థానాలు లభించేలాగా పలువురు అధికారులు తెర వెనుక చక్రం తిప్పారు. కల్లూరు మండలం నుంచి ఖమ్మం నగర కేంద్రానికి సర్దుబాటు చేశారని, ఖమ్మం నగర కేంద్రం నుంచి కల్లూరుకు, పెనుబల్లి నుంచి బోనకల్‌కు, సింగరేణి నుంచి ఖమ్మంకు, వేంసూరు నుంచి ఖమ్మంకు, ఖమ్మం నుంచి వేంసూరుకు, తల్లాడ నుంచి ఖమ్మంకు ఉపాధ్యాయులను అడ్డగోలుగా సర్దుబాటు చేశారన్న విమర్శలు వినవస్తున్నాయి. సర్దుబాట్ల నిబంధనల ప్రకారం పరస్పర సర్దుబాటుకి అవకాశం లేదు. అయినప్పటికీ ఆ అవకాశాన్ని జిల్లా విద్యాశాఖ కల్పించడం గమనార్హం. నిబంధనలను తుంగలోకి తొక్కి ద్విముఖ, త్రిముఖ సర్దుబాటులు కూడా చేశారు. జీవో 34 ప్రకారం వికలాంగులను వారు ఉన్న స్థానం నుంచి వారి అంగీకారం లేకుండా కదిలించకూడదు. కానీ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వారిని కూడా సర్దుబాటు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని మండలాల్లో మండల విద్యాశాఖాధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కాగా.. జిల్లా విద్యాశాఖ సర్దుబాటు ప్రక్రియను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ నాయకులు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన సర్దుబాటులన్నింటినీ రద్దు చేసి.. నిబంధనల ప్రకారం సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించి.. అక్రమ సర్దుబాటులన్నింటిపై సమగ్రంగా చర్చించి రద్దు చేయాలని వారు కోరారు.

పల్లె నుంచి పట్టణాలకే మొగ్గు..

జిల్లా వ్యాప్తంగా వివిధ సబ్జెక్టులకు సంబంధించి మొత్తం 311మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. ఒక మండలంలోని ఉపాధ్యాయులను అదే మండలంలో సర్దుబాటు చేయాల్సిన అధికారులు మండలాలు దాటి ఖమ్మం పట్టణానికి సర్దుబాటు చేశారంటే పైరవీలు ఏ స్థాయిలో పని చేశాయో అర్థమవుతోంది. ఎక్కువ మంది ఉపాధ్యాయులు పల్లెలు వద్దు.. పట్టణాలే ముద్దు అన్న చందంగా మారుమూల ప్రాంతాల నుంచి ఖమ్మం పట్టణానికి సర్దుబాటు చేయించుకున్నారు. పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు పూర్తి కాగా.. ఇప్పటికీ పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులు చదువులో వెనుకబడి పోతున్నారు.



జిల్లాలోని 21 మండలాలలో సర్దుబాటు ఇలా..

ఎస్‌ఏ బయోలజీ, సోషల్ సైన్స్ 15 మంది, ఎస్‌ఏ ఇంగ్లీష్ 9 మంది, ఎస్‌ఏ హిందీ 26 మంది, ఎస్‌ఏ గణితం 15 మంది, ఎస్‌ఏ ఫిజిక్స్ 12 మంది, ఎస్‌ఏ సోషల్ 16 మంది, ఎస్‌ఏ తెలుగు 8 మంది, ఎస్‌జీటీలు 206, స్పెషల్ ఎస్‌జీటీలు ఒక్కరు, దివ్యాంగులు ఒక్కరు, పీఈటీలు ఒక్కరు.. మొత్తం 311 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. అత్యధికంగాకంగా తిరుమలాయపాలెం, పెనుబల్లిలో 22 మంది, కల్లూరు, రఘునాథపాలెం 20 మంది, ఖమ్మం అర్బన్, ముదిగొండ, కొణిజర్ల 18 మంది, అత్యల్పంగా వేంసూర్ మండలానికి నలుగురు, కామేపల్లి మండలానికి ఐదుగురు, చింతకాని, ఏన్కూరు, ఎర్రుపాలెంకు ఎనిమిది మంది సర్దుబాటు చేశారు. దూరప్రాంత మండలాలకు తక్కువగా, పట్టణాలకు దగ్గరలోని మండలాలకు ఎక్కువ మంది ఉపాధ్యాయులను నిబంధనలకు విరుద్ధంగా సర్దుబాటు చేశారనే విమర్శలు వినవస్తున్నాయి.

కొనుగోళ్లకు... సన్నాహాలు!

» వానాకాలం ధాన్యం కొనేందుకు ప్రణాళిక ఖరారు
» 3.69లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు సేకరణ లక్ష్యం
» సిద్ధంగా 4.35లక్షల గన్నీబ్యాగులు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పౌరసరఫరాల సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. నవంబరు నుంచి జిల్లాలో కొనుగోళ్ల ప్రారంభం కానుండగా.. 326కేంద్రాల ద్వారా 3,69,609మెట్రిక్ టన్నుల సేకరణను లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందులో సన్న రకాలు 3,51,129 మెట్రిక్ టన్నులు కాగా 18,480 మెట్రిక్ టన్నులు దొడ్డురకం ధాన్యాన్ని సేకరించనున్నారు. జిల్లాలో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన 43,51,977 గన్నీ సంచులు సిద్ధంగా ఉన్నాయి. మరో 30,79,769 గన్నీ సంచుల అవసరం ఉంది. ఇక కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గోదాములను కూడా సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధి రెండో జోన్లో ఉన్న జిల్లాలో అక్టోబర్ చివరి వారంలో వరి కోతలు మొదలవనుండగా.. నవంబరు మొదటి వారం నుంచే కొనుగోళ్లకు సిద్ధం చేస్తున్నారు.

2.91లక్షల ఎకరాల్లో వరిసాగు..

జిల్లాలోని నాగార్జునసాగర్ ఆయకట్టుతో పాటు బోర్లు, బావులు, ఇతర నీటి వనరుల కింద వానాకాలంలో 2,91,683 ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో సన్న రకం 1,12051 ఎకరాలు, దొడ్డు రకం 5989 ఎకరాలు

నవంబరు నుంచి సేకరణ లక్ష్యమిలా..

దిగుబడి అంచనాలు	: 7.23లక్షల మె.ట.
పౌరసరఫరాల సంస్థ కొనుగోలు లక్ష్యం	: 3.60లక్షల మె.ట.
మొత్తం కొనుగోలు కేంద్రాలు	: 326
సన్నరకాల సేకరణ కేంద్రాలు	: 275
దొడ్డు రకాల కోసం	: 51



న్నాయి. ఈ ఏడాది కూడా రైతులు సన్నరకాల సాగుకే ప్రాధాన్యమిచ్చారు. ప్రభుత్వం మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500బోనస్ చెల్లిస్తుండడంతో అన్నదాతలు సన్నరకాలపైనే మక్కువ చూపారు. ఈ వానాకాలంలో 7,23,988 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో మిల్లర్లు, వ్యాపారుల కొనుగోళ్లు 3,02,408 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తారని ఆశిస్తున్నారు. ఇవి పోను రైతుల నుంచి ధాన్యం కొనేలా పౌరసరఫరాల సంస్థ కసరత్తు చేస్తోంది. ఈమేరకు 3,69,609 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది.

పాక్స్ కేంద్రాల ద్వారానే...!

జిల్లాలో మొత్తం 326 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో సన్నరకాల కోసం 275 దొడ్డు రకాల కోసం 51 కేంద్రాలు ఉంటాయి. వీటిలో పీఏసీఎస్‌లు 155, డీసీఎంఎస్ 28, మెప్మా ఆధ్వర్యంలో 3 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. నవంబరు నుంచి వచ్చే ఏడాది జనవరి 26వతేదీ వరకు ఆయా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నిర్వహించనున్నారు. ఇక ముందస్తుగా ఏ ప్రాంతాల్లో వరి కోతలు మొదలైతే అక్కడ ముందస్తు కొనుగోళ్లు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పౌరసరఫరాల సంస్థ అధికారులు తెలిపారు.

ఆర్టీసీలో ఉద్యోగోన్నతులు, బదిలీలు

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలోని ఏడు ఆర్టీసీ డిపోల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులకు శుక్రవారం ఉద్యోగోన్నతులు, బదిలీల ప్రక్రియను రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ నిర్వహించారు.

ఖమ్మం రీజియన్‌లో కండక్టర్లు, డ్రైవర్లు, శ్రామిక్‌లకు పదోన్నతులు కల్పించడంతో పాటు వారు కోరుకున్న చోటుకు బదిలీలు చేశారు. బాధ్యతలు తీసుకున్న ఏడాదిలోనే ఆర్ఎం రెండోసారి పదోన్నతులు, బదిలీలు చేపట్టడం పట్ల రీజియన్ పరిధిలోని ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. 14 మంది శ్రామికులకు హెల్పర్లుగా పదోన్నతి, 14 మెకానిక్స్, ఆర్టిజన్లకు గ్రేడ్ వన్ మెకానిక్‌లుగా, 14 మంది కండక్టర్లు, డ్రైవర్లకు ఏడీసీలుగా, ఐదుగురు ఏడీసీలకు టీవన్‌త్రీ గా ఉద్యోగోన్నతి కల్పించారు. ఇక 11మంది ఏడీసీలు, ఆరుగురు టీవన్‌త్రీలు వారు కోరుకున్న డిపోనకు బదిలీ చేశారు.

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులను తనిఖీ చేయాలి

» పరిశీలనకు నాలుగు బృందాలు
» కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో అదనపు కలెక్టర్ శ్రీజ సమీక్ష

6

వణికిన వైరాకు 20ఏళ్లు



వైరా రిజర్వాయర్..



125మీటర్ల పొడవుతో నిర్మించిన రిజర్వాయర్ ఐదో అలుగు

- అప్పట్లో రెండు రోజుల్లోనే 46 సెంటీ మీటర్ల వర్షపాతం
- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- భయం గుప్పిట వైరా ప్రాంత వాసులు
- శాంతిభద్రతల సమస్యగా మారిన ముంపు రాజకీయం
- 125మీటర్ల పొడవుతో కొత్త అలుగు నిర్మాణం

వైరా, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 20 ఏళ్ల క్రితం వైరాతో పాటు పరిసర ప్రాంతాలన్నీ భయం గుప్పిట్లో గజగజ వణికిపోయాయి. ఇప్పుడు దేశంలో, రాష్ట్రంలో పలుచోట్ల వినిపిస్తున్న క్లౌడ్‌బరస్ట్ రీతిలో అప్పట్లోనే వైరాలో కేవలం రెండురోజుల్లోనే 46సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. ఒకేరోజు 29సెంటీమీటర్ల వర్షం కురిసింది. దీంతో వందేళ్ల పైబడిన వైరా రిజర్వాయర్ చరిత్రలోనే అత్యధికంగా 23.6అడుగుల నీటిమట్టం నమోదైంది. ఆ సమయంలో రిజర్వాయర్ ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉందని ఈప్రాంత ప్రజలు భయం గుప్పిట్లో వణికిపోయారు. అదృష్టం కొద్దీ ఎడమకాల్వ హెడ్‌స్లూయిస్ వద్ద భారీ గండి పడి వరద నీరు బయటకు పోవడంతో రిజర్వాయర్ పెను ఉపద్రవం నుంచి సురక్షితంగా బయటపడింది. ఆస్తి నష్టం జరిగినప్పటికీ ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

2005 సెప్టెంబరు 20, 21 తేదీల్లో..

అది 2005 సంవత్సరం సెప్టెంబరు 20, 21తేదీలు. 18.3అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టం కలిగిన వైరా రిజర్వాయర్ ఆ ఏడాది సెప్టెంబరు 19వ తేదీన కేవలం 16.11 అడుగుల నీటిమట్టంతో ఉంది. ప్రకృతి వైపరీత్యంతో 20వ తేదీన ఒక్కరోజే 29సెంటీమీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది. రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలతో రిజర్వాయర్ నీటిమట్టం ఒక్కరోజులోనే 16.11అడుగుల నుంచి 22అడుగులకు రాత్రికి రాత్రే పెరిగింది. 5.1అడుగుల నీటిమట్టం ఒక్క రాత్రిలోనే రిజర్వాయర్‌కు రావడంతో వరదనీరు రిజర్వాయర్‌లో పోటెత్తింది. అదేనెల 21వతేదీన ఏకంగా 17సెంటీమీటర్లకుపైగా వర్షపాతం నమోదైంది. దాంతో రిజర్వాయర్ నీటిమట్టం 23.6అడుగులకు చేరుకుంది. భారీ గాలులతో రిజర్వాయర్‌లోని నీళ్లు ఆనకట్ట పైనుంచి బయటకు ఎగిసిపడ్డాయి. ఏక్షణంలోనైనా ఆనకట్ట తెగిపోతుందని ప్రజలు భీతిల్లిపోయారు. అప్పటి కలెక్టర్ జిల్లా యంత్రాంగాన్ని రంగంలోకి దించి కుడి కాల్వ హెడ్‌స్లూయిస్, ఆనకట్ట మధ్యలోని రోడ్డుకు గండి పెట్టించి వరదనీటిని బయటకు పంపించటానికి భారీ యంత్రాలను ఏర్పాటు చేశారు. ఆ ఏర్పాట్లు జరుగుతుండగానే ఎడమకాల్వ హెడ్‌స్లూయిస్ పక్కన వరద నీటికి భారీ గండి పడింది. దాంతో అధికారులు గండి పెట్టేందుకు చేసిన ఏర్పాట్లను ఉపసంహరించుకున్నారు.

ఎడమకాల్వ హెడ్‌స్లూయిస్ వద్ద పడిన గండితో రిజర్వాయర్ ప్రమాదం నుంచి బయటపడింది. అప్పుడు రిజర్వాయర్ నుంచి వరదనీరు బయటకు వెళ్లేందుకు నాలుగు అలుగులు మాత్రమే ఉన్నాయి. వాటి ద్వారా 70వేల క్యూసెక్కుల వరదనీరు మాత్రమే బయటకు వెళ్లే అవకాశముంది. దాంతో ఒక్కసారిగా భారీ వరదనీరు రావడంతో ఆనకట్టపై ఒత్తిడి పెరగడంతో అటు అధికార యంత్రాంగంతో పాటు ఇటు ప్రజలు బెంబేలెత్తిపోయారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

రిజర్వాయర్‌కు వచ్చిన భారీ వరదనీరు నాలుగు అలుగుల నుంచే కాకుండా ఎడమకాల్వకు పడిన గండి నుంచి వైరా నది ద్వారా బయటకు పరవళ్లు తొక్కడంతో పంటపొలాలన్నీ నీటమునిగి ఇసుక మేటలు వేశాయి. ప్రస్తుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం, ముసలిమడుగు గ్రామాలను వరదనీరు ముంచెత్తింది. అలాగే వైరాలోని ఇందిరమ్మ కాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాలు నీటమునిగాయి. కాగా.. ఈ వరదలతో ముంపునకు గురైన ముసలిమడుగు గ్రామం ఆ తర్వాత రాజకీయ వైషమ్యాలతో నిండిపోయి శాంతి భద్రతల సమస్య తలెత్తింది. అప్పటి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోనేరు రంగారావు సహకారంతో ప్రస్తుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నాడు ముసలిమడుగు గ్రామాన్ని మెరక ప్రాంతానికి తరలించి మోడల్ గ్రామాన్ని నిర్మించాలని తలపెట్టారు. తన సోదరుడు మల్లు రవికి చెందిన కొంత భూమితో పాటు ముసలిమడుగు గ్రామానికి చెందిన ఒక రైతు నుంచి ఎక్కువ భాగం భూమిని మోడల్ గ్రామానికి సేకరించాలని అధికారులు ఏర్పాట్లు చేయడంతో ముసలిమడుగులో శాంతిభద్రతల సమస్య తలెత్తింది. సదరు రైతు చింతనిప్పు రాంబాబు కోర్టును ఆశ్రయించడంతో మోడల్ గ్రామ నిర్మాణాకి అడ్డంకులు ఏర్పడ్డాయి. దాంతో ఆగ్రామంలోని ప్రజలు రాజకీయ పార్టీలుగా విడిపోయారు. పరస్పరం ఘర్షణలకు పాల్పడ్డారు. పోలీసు పికెట్ ఏర్పాటుచేశారు.

125మీటర్ల పొడవుతో కొత్త అలుగు నిర్మాణం

వైరా రిజర్వాయర్‌ను కాపాడేందుకు అప్పటికే ఉన్న నాలుగు అలుగులకు తోడు కొత్తగా మరో అలుగు నిర్మాణం చేపట్టారు. జపాన్ బ్యాంకు నిధులతో వైరా కాల్వల ఆధునికీకరణతోపాటు 125మీటర్ల పొడవుతో కొత్త అలుగును నిర్మించారు. 1,2 అలుగుల తర్వాత ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో రెండు గుట్టల మధ్య ఉన్న మట్టి ఆనకట్టను తొలగించి దాని స్థానంలో కొత్త అలుగును నిర్మించారు.



రామాలయంలో టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

స్వర్ణ భద్రకవచాలతో దర్శనమిచ్చిన రామయ్య

● స్వామి వారిని దర్శించుకున్న టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు

భద్రాచలం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారు శుక్రవారం స్వర్ణభద్ర కవచాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే స్వామి వారిని రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి స్వాగతం పలుకగా.. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీజీవో అధ్యక్షులు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారంకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో డివిజన్ అధ్యక్షులు డెక్కా నరసింహారావు, కార్యదర్శి గగ్గూరి బాలకృష్ణ, తహసీల్దారు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దేశంలో పెరుగుతున్న కమ్యూనిస్టుల ఆవశ్యకత

● సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టుల అవశ్యకత పెరుగుతుందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి యువతరానికి కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలపై అవగాహన కల్పించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు ఛండీఘర్‌లో జరిగే సీపీఐ 25వ జాతీయ మహాసభల్లో ఈ మేరకు ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. ఖమ్మం జిల్లా నుంచి 8మంది ప్రతినిధి వర్గం హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి దండి సురేశ్, నాయకులు మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులను తనిఖీ చేయాలి

▸▸ తనిఖీ కోసం 4 బృందాలు ▸▸ అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 26వ తేదీ లోగా జిల్లాలోని 26 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులను తనిఖీ చేసి నివేదికను అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులపై ఆమె సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీజ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న 26 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులను తనిఖీ చేసేందుకు డీసీపీఓ, డీవైఎస్‌ఓ, డీడబ్ల్యూఓ, ఏడీ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రి భవన ప్లాన్, ఆక్యూపెన్సీ సర్టిఫికేట్, ట్రేడ్ లైసెన్స్, ఫైర్ శాఖ ఎన్‌ఓసీ, బ్లడ్ బ్యాంక్ లైసెన్స్, ఆస్పత్రి భవనం ఎత్తు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సర్టిఫికెట్, బయో మెడికల్ వేస్టేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఎపీఎంసీఈ, ఫార్మసీ లైసెన్సు, అంబులెన్స్ ఫిట్నెస్ రిజిస్ట్రేషన్, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ రిజిస్ట్రేషన్ వంటి అన్ని పత్రాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో ఇన్ ఫ్రా, ఎక్విప్మెంట్, స్టాఫ్ వివరాలు, రాత్రిపూట వైద్యులు అందుబాటులో ఉంటున్నారా, డ్రైనేజీ వ్యవస్థ ఎలా ఉంది!? వంటి అన్ని అంశాలను పరిశీలించాలన్నారు. ఆసుపత్రి స్పెషాలిటీ కోడ్ ప్రకారం ఎక్విప్మెంట్ ఉందో.. లేదో పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి. కళావతిబాయి, డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి, డీడబ్ల్యూఓ కె. రాంగోపాల్ రెడ్డి, సీడీపీవో విష్ణువందన పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా 'ఈసీహెచ్‌ఎస్' నిర్వహణ



ఆర్మీ ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న మాజీ సైనికులు

ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈసీహెచ్‌ఎస్ పాలీ క్లినిక్.. ఇది ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ త్రివిధ సాయు ధ దళాలలో పని చేస్తున్న జవాన్ల కుటుంబా లకు, మాజీ సైనికుల కుటుంబాలకు ఉచితంగా తక్షణ, అత్యవసర వైద్య సహాయం అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశాల. నగరంలోని సైనిక సంక్షేమ కార్యాలయంలో గత ఏడాది దీన్ని ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడ వైద్యులు మందుల కొరత, ల్యాబ్ ఎక్విప్‌మెంట్ లేమి తదితర సమస్యలతో తూతూ మంత్రంగా.. తమ ఇష్టారాజ్యంగా వైద్య సేవలందిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఇక్కడ పనిచేసే ఒక ఉద్యోగి ఇక్కడ లేని మందులను ఆస్పత్రి సమీపంలో ఉన్న తన బంధువుకు చెందిన జనరిక్ మెడికల్ షాపు ద్వారా తెప్పించుకుంటూ ప్రతి నెలా లక్షల్లో బిల్లులు డ్రా చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సదరు బిల్లుల్లో కొన్ని వాస్తవంగా మందులు కొనుగోలు చేసిన వాటితో పాటు మరి కొన్ని బిల్లులు అసలు మందులు కొనుగోలు చేయకుండా ఇచ్చే నకిలీ బిల్లులు ఉన్నాయని పలువురు మాజీ సైనికులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పాలీ క్లినిక్‌లో జరుగుతున్న అవకతవకలపై కొంతమంది మాజీ సైనికుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం హైదరాబాద్ నుంచి రీజినల్ ఈసీహెచ్‌ఎస్ ఉన్నతాధికారులు నగరంలోని ఆస్పత్రికి వచ్చి విచారణ జరిపారు.

ఆర్మీ ఉన్నతాధికారులకు మాజీ సైనికుల కుటుంబీకుల మొర

మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు ఈసీహెచ్‌ఎస్ హాస్పిటల్‌లో తమకు అందుతున్న వైద్య సదుపాయాలను అధికారులకు వివరించారు. హాస్పిటల్‌లో తమకు వైద్య సేవలు సరిగ్గా అందట్లేదని, మందుల కొరత, ల్యాబ్ ఇక్విప్‌మెంట్ లేదని ఆర్మీ ఉన్నతాధికారులకు మొర పెట్టుకున్నారు. తాను హాస్పిటల్‌కు వస్తే పట్టించుకోవట్లేదని ఓ మాజీ సైనికుడి భార్య కన్నీరు పెట్టుకోవడం అక్కడ ఉన్న వారిని కలిచి వేసింది. తాము ఇతర ఆరోగ్య సేవల కోసం విజయ వాడలో ఉన్న ఈసీహెచ్‌ఎస్‌కి వెళ్లడానికి వారానికోసారి అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని ఉన్నతాధికారులను కోరారు.

డ్రైవర్ పర్మిషన్ ఉంటేనే లోపలికి అనుమతి

హాస్పిటల్‌లోకి వెళ్లాలంటే అక్కడ డ్రైవర్‌గా పని చేస్తున్న వ్యక్తి అనుమతి ఉండాలని, లేకపోతే లోపలకు అనుమతించరని కొందరు మాజీ సైనికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో పని చేసే ఇద్దరు డాక్టర్లు, పర్యవేక్షణ అధికారి మినహా మిగితా కిందిస్థాయి సిబ్బందే ఇక్కడ తమ హవా నడిపిస్తారని విమర్శలు ఉన్నాయి. ఇక్కడి సిబ్బంది పర్యవేక్షణ అధికారికి సహకరించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ హాస్పిటల్ లక్ష్యాన్ని నీరు గారుస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో హాస్పి టల్‌లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని, అదే సమయంలో క్లినిక్‌లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారులు తక్షణమే పరిష్కరించాలని మాజీ సైనికుల కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

యూరియా కొరత సృష్టిస్తూ
దివాళా తీసేలా మోదీ విధానాలు



సత్తుపల్లిలో ప్రదర్శనతీస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశద్రోహ, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రధాని మోదీ యూరియా కొరత సృష్టిస్తూ రైతాంగం దివాళా తీసేలా దేశంలో పాలన సాగిస్తున్నారని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు, ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి హనుమంతరావు అన్నారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం సత్తుపల్లి పట్టణంలో అటవీ, తహసీల్దార్ కార్యాలయాలకు ప్రదర్శనగా వచ్చి ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంటా శ్రీను, ఒగ్గు నాగిరెడ్డి, భాస్కరరావు, విశ్వనాధం, రాజు, వెంకటేష్, రాఘవులు, ప్రసాద్, అలివేలు, కృష్ణవేణి, వెంకటమ్మ, భద్రం తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ సామగ్రి చోరీ


మణుగూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మణుగూరు నుంచి పినపాక మండలం బయ్యారం వరకు ఏర్పాటు చేస్తున్న నూతన విద్యుత్ టవర్‌లైన్ల ఏర్పాటుపై దొంగల కన్నుపడింది. ఇప్పటికి వరుసగా మూడోసారి విద్యుత్ వైర్లను టవర్ల యాంగ్లర్లు, ప్లేట్లు ఎత్తుకుపోయారు. మండల పరిధిలోని రామానుజారం గ్రామంలో టవర్‌కు సంబంధించి రూ.15వేల సామగ్రి చోరీ కాగా, రూ.70వేల విలువైన 100 స్కేర్ ఎంఎం కండక్టర్‌ను ఎత్తుకు పోయారు. ప్రస్తుతం రూ.15 వేల విలువ గల యాంగ్లర్లను దొంగిలించారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కాంట్రాక్టర్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సిద్ధారంలో 8 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులకు చెందాల్సిన 8క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు, పౌర సరఫరాల శాఖ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. సివిల్ సప్లయ్ ఆర్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని కంపా బాలాజీ ఇంటిలో నిల్వ ఉంచిన 8 క్వింటాళ్ల బియ్యంను దాడిచేసి పట్టుకున్నారు. అనంతరం అతనిపై 6ఏ కేసు నమోదు చేసి ఎంఎల్ఎస్ పాయింట్‌లో చేర్చినట్లు తెలిపారు. పేదలకు చెందాల్సిన పీడీఎస్ బియ్యంను చౌక దుకణాల డీలర్లు, పక్కదారి పట్టించినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. భారతదేశంలో లౌకికతత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. శుక్రవారం మంచికంటి భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలైపోతున్నారని, మాదక ద్రావ్యాలకు వ్యతిరేకంగా యువత నడుం బిగించాలన్నారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచిపోషించే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు లిక్కి బాలరాజు, అన్నవరపు కనకయ్య, కోటా రమేష్, అన్నవరపు సత్యనారాయణ, వీర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ అభివృద్ధికి ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

భక్తులకు మెరుగైన సేవలందిస్తూనే దేవస్థానం ఆదాయం గతంలో కంటే పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆలయ అభివృద్ధికి ప్రాథమిక నమూనా..

ప్రభుత్వం రామాలయ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే భూ సేకరణ పనులు పూర్తవగా నిర్వాసితులకు నష్టపరిహారాన్ని కూడా చెల్లించాం. అయితే ఆలయాభివృద్ధి కోసం ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి ఇప్పటికే ప్రాథమిక నమూనాను సిద్ధం చేశారు. దీనిపై గత నెలలో జిల్లా కలెక్టరు జితేష్ వి పాటిల్ అధ్యక్షతన సమావేశం జరిగింది. రూ.350 కోట్ల ప్రాథమిక అంచనాలతో ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అయితే వైదిక సిబ్బంది సూచనలు, సలహాలు పరిగణనలోకి తీసుకొని ముందుకెళ్తున్నాం. దసరా తరువాత ఈ ప్రక్రియ మరింత ముందుకు వెళ్లనుంది. ప్రసాద్ పథకం పనులు కూడా వేగవంతంగా పూర్తయితే అన్నదాన సత్రం నిర్వహణకు ఇక్కట్లు తప్పుతాయి.

డిజిటలైజేషన్‌లో ముందంజ..

భద్రాద్రి దేవస్థానం ఇప్పటికే డిజిటలైజేషన్‌లో ముందంజలో ఉంది. అన్ని కీలక విభాగాల్లో దీనిని అమలు చేస్తుండటంతో సత్ఫలితాలు వస్తున్నాయి. ఈ క్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంతో ఈ ఆఫీసు ఫైలింగ్‌ను అనుసంధానిస్తాం. ఇందుకు సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమవగా త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. దీని ద్వారా పారదర్శకతతో పాటు సమయం కలిసొస్తుంది.

ఆలయ భూముల రక్షణపై ప్రత్యేక దృష్టి

భద్రాద్రి రామయ్య భూముల్లో ఆక్రమణలు జరిగితే ఏ మాత్రం సహించేది లేదు. ఇప్పటికే ఈ విషయమై ఏపీలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నంలో ఉన్న రామయ్య భూముల్లోని ఆక్రమణదారులతో మాట్లాడాం. న్యాయస్థానాల్లో దేవస్థానానికి అనుకూలంగా తీర్పులు వచ్చినా పూర్తిస్థాయిలో వారు సహకరించడం లేదు. ఈ క్రమంలో ఇప్పటికే దేవాదాయ శాఖ కమిషనర్, దేవాదాయ శాఖ భూ రక్షణ విభాగం బాధ్యులు, కలెక్టర్, సబ్‌కలెక్టర్ దేవస్థానం ఈవోలతో కమిటీని ఏర్పాటు చేశారు. ఇటీవల కూడాసామాజిక మాధ్యమాల్లో భూముల విక్రయాలకు సంబంధించి చేసిన పోస్టుపై స్పందించి వారిని హెచ్చరించాం. రామయ్య భూములు విక్రయించాలన్నా, నిర్మించాలని చూసినా క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే భూములను పర్యవేక్షించేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశాం. అలాగే 2018 నుంచి వారు చెల్లించాల్సిన డ్యామేజింగ్ చార్జీలను చెల్లించేలా చర్యలు తీసుకుంటాం.

పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు

2015లో గోదావరి పుష్కరాలకు 60 లక్షల మంది భక్తులు తరలొచ్చారు. ఈసారి 1.50కోట్ల మంది వస్తారనే అంచనాతో దేవస్థానపరంగా చేపట్టాల్సిన చర్యలపై కసరత్తు చేయబోతున్నాం. ప్రధానంగా భక్తులకు స్వామి వారి మూలవరుల శీఘ్ర దర్శనం అందించడంతో పాటు లడ్డూ ప్రసాదాలు విక్రయించేందుకు అధిక సంఖ్యలో కౌంటర్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. రోజూ పది నుంచి 15 లక్షల మంది భక్తులు వస్తారనే అంచనాతో అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేపట్టబోతున్నాం. ఇందుకోసం తాత్కాలిక వసతి, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతరత్రా వాటిపై దృష్టిసారిస్తున్నాం.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

ఈవోగా నేను బాధ్యతలు చేపట్టిన అనంతరం వివిధ విభాగాలను తనిఖీ చేశాం. ఈ క్రమంలో ప్రధాన విభాగాల్లో స్వచ్ఛత, పరిశుభ్రత ఉండేలా చూడాలని సిబ్బందికి ఇప్పటికే సూచించాం. అలాగే రామయ్య అన్నప్రసాదం మరింత రుచికరంగా, నాణ్యంగా ఉండాలని ప్రత్యేక ఆదేశాలు జారీ చేశాం.

'సీతారామ' భూ సేకరణను తక్షణమే పూర్తి చేయాలి

- డిస్ట్రిబ్యూషన్ కాలువ సర్వే పనులూ వేగవంతం కావాలి
- ప్రాజెక్ట్ పనుల పురోగతిపై సమీక్షలో ఖమ్మం కలెక్టర్ అనుదీప్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



హాజరైన అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇందుకోసం పెండింగ్‌లో ఉన్న భూ సేకరణను వేగవంతం చేయాలని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీతారామ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్‌తో కలిసి నీటిపారుదల, రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు పనుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నీటిపారుదల శాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు వివరించారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 7లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరుఅందించే సీతారామ ఎత్తిపోతల పథకం పనులు భూ సేకరణ, అటవీ సమస్యలతో జాప్యం జరుగుతోందని, పనులను వేగవంతం చేయాలని సూచించారు. భూసేకరణ చెల్లింపులు డిప్యూటీ సీఎం సహకారంతో సకాలంలో పూర్తిచేస్తామన్నారు. యాతాలకుంట ద్వారా జనవరి నాటికి నీరు విడుదల చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, దీనికి సంబంధించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. యాతాలకుంట వద్ద పనులు పూర్తిచేస్తే సత్తుపల్లి నియోజక వర్గానికి గోదావరి జలాలు చేరతాయన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి ఖమ్మం జిల్లా నుంచి 507 ఎకరాల అటవీ భూమి బదులుగా ప్రత్యామ్నాయ భూముల కేటాయింపు చేపట్టాలని, ప్యాకేజీ 13 పరిధిలో చేపట్టనున్న 10 కిలోమీటర్ల కాలువ నిర్మాణానికి అవసరమైన 167 ఎకరాల పట్టా భూముల అవార్డు పాస్‌చేసి నెల రోజుల లోపు భూ బదలాయింపు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్యాకేజీ 14పరిధిలో పబ్లిక్ నోటిఫికేషన్ దశలో ఉన్నవాటికి 3నెలల్లో అవార్డు పాస్ చేయాలన్నారు. అరెకరాల భూ సేకరణ వారం రోజులలో, ప్యాకేజి 16 పెండింగ్ భూ సేకరణ 7 రోజుల్లో పూర్తి కావాలని, ఖమ్మం జిల్లాలో డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు భూ సేకరణ ప్రతిపాదనలను ఫైనల్ చేయాలన్నారు. డిస్ట్రిబ్యూటర్ కాల్వల భూ సేకరణ సర్వే పనుల కోసం సర్వేయర్లను డిప్యూటేషన్ పై తీసుకురావాలని, అదనపు బృందాలు ఏర్పాటు చేసి 20 రోజుల్లో సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ కొత్తగూడెం ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు, నీటిపారుదల, ఫారెస్ట్, రెవెన్యూశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆరు గ్రామాలకు నిలిచిన తాగునీటి సరఫరా

- వారం రోజులుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పగిలిన పైపులైన్.. మరమ్మతులు చేపట్టడంలో అధికారుల నిర్లక్ష్యం



గుండెపుడిలో ట్యాంకర్‌లో నీటిని పట్టుకుంటున్న ప్రజలు

జూలూరుపాడు, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు తాగునీటి సరఫరాను పునరుద్ధరించే విధంగా చర్యలు చేపట్టక పోవటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వినోభానగర్, వీరభద్రాపురం, సురారం, గుండెపుడి, రామచంద్రాపురం, అనంతారం తదితర గ్రామాలకు వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడంలేదు. జూలూరుపాడులోని పత్తి ఉప మార్కెట్ యార్డ్ సమీపంలో నీటిని సరఫరా చేసే మెయిన్ పైపులైన్ పగలడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో తాగునీటి ఇబ్బందులను తొలగించాలని అధికారులకు విన్నవించారు. కాగ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు మాత్రం నిర్లక్ష్యన్ని ప్రదర్శిస్తుండటంతో ప్రజలు అవస్థలకు గురికావల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈఈ నాగకిషోర్‌రెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పైపులైన్ పగలడంతో పలు గ్రామాల్లో నీటి సరఫరా నిలిచిపోయిందని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. వర్కర్లు సమ్మెలో ఉన్నారని, అందువల్లే మరమ్మతులను చేపట్టడంలో ఆలస్యం అవుతుందని తెలిపారు. రెండు రోజుల్లో పైపులైన్‌కు మరమ్మతులను చేయించి నీటి సరఫరాను పునరుద్ధరుంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లా యూనిట్‌గా బహుళ పంటల సాగుకు ప్రణాళిక సిద్ధం చేయాలి

కొణిజర్ల, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): జిల్లా యూనిట్‌గా బహుళ పంటల సాగుకు ప్రణాళికలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా జిల్లాను యూనిట్‌గా తీసుకుని బహుళ పంటల సాగుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, మిర్చి, పత్తిసాగు చేసిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతనిప్పు చలపతిరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని లాలాపురం గ్రామలో జరిగిన రైతుసంఘం సమావేశంలో వారు మాట్లాడారు. గత సీజన్‌లో మిర్చి, పత్తిసాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, మిర్చిధర పాతాళానికి పడిపోయిందన్నారు. కేంద్రప్రభుత్వం మిర్చికి కూడా ఇతర పంటల వలే కనీస మద్దతు ధర క్వింటాకు రూ.20వేలు ఇచ్చేలా నిర్ణయం చేయాలని కోరారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)పత్తి పంట కొనుగోలు వ్యవసాయం మార్కెట్ ఆవరణలో చేయాలని అలా కాకుండా జిన్నింగ్ మిల్లులు వద్ద చేయడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా పత్తి కొనుగోలుకు తెచ్చిన నిబంధనలు రైతులకు నష్టం చేసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గోపవరం సొసైటీ డైరెక్టర్ సంక్రాంతి నరసయ్య, రైతుసంఘం నాయకులు సంక్రాంతి పురుషోత్తం, సంక్రాంతి పుల్లయ్య, సంక్రాంతి వెంకటనరసయ్య, వేము బాబు, నామా శ్రీనివాసరావు, పాటి శ్రీనివాసరావు, చింతనిప్పు సత్యం పాల్గొన్నారు.

ఆధిపత్య పోరు.. అంతర్గత కుమ్ములాటలు!

దిగజారుతున్న సింగరేణి విద్యాసంస్థల ప్రతిష్ట

రద్దయిన గోల్డెన్ జూబ్లీ వేడుకలు

అధ్యాపకుల మధ్య విభేదాలే కారణం?

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల చరిత్ర కలిగిన సింగరేణి విద్యాసంస్థ రోజురోజుకి దిగజారిపోతుంది. ఒకప్పుడు రాష్ట్ర యూనివర్శిటీ స్థాయిలో మంచి గుర్తింపు పొందిన సింగరేణి విద్యాసంస్థ అంతర్గత కుమ్ములాటలతో ప్రతిష్ట మసకబారుతుంది. ఇక్కడి అధికారులను సైతం బదిలీ చేయించే సత్తా ఈ విద్యాసంస్థలో పనిచేసే అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు ఉంది. సింగరేణిలో ఒకప్పుడు 17 పాఠశాలలు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య తొమ్మిదికి పడిపోయింది. కొన్ని పాఠశాలలను విలీనం చేశారు. రామకృష్ణాపూర్ స్కూల్‌కి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న మందమర్రి పాఠశాలలో కలిపారు. ప్రస్తుతం సింగరేణి పరిధిలో తొమ్మిది పాఠశాలలు, ఒక జూనియర్ కాలేజీ, ఒక డిగ్రీ కళాశాల, ఒక పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల, ఒక పాలిటెక్నిక్ కళాశాల ఉంది. దీంతో పాటు మంథనిలో ఉన్న జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సింగరేణి సంస్థ ఉద్యోగుల పిల్లలకు కొన్ని ఇంజనీరింగ్ సీట్లు కేటాయించారు. ఈ ఏడాది 2025-26 నుంచి గోదావరిఖని 8 ఇంక్లైన్‌లో ఓ స్కూల్లో కొత్తగా ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్‌తో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. కొత్తగూడెం ఇల్లందు, మణుగూరు, సింగరేణి పాఠశాలలో దాదాపు 1000 జరిగితే.. ఆ దాడుల్లో 1600 మంది విద్యార్థులే ఉన్నారు. సింగరేణి పాఠశాలలో సింగరేణి ఉద్యోగుల పిల్లలతో పాటు బయట విద్యార్థులు కూడా చదువుకుంటున్నారు.

తిరోగమన దిశలో సింగరేణి విద్యాసంస్థలు

ఒకప్పుడు సింగరేణి విద్యాలయాల్లో సీట్లు దొరక్క తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడేవారు. ఈ సంస్థలో చదివిన పిల్లలు ఎంతోమంది ఉన్నతస్థాయిలో ఉన్నారు. మంచి క్రమశిక్షణ, అకడమిక్ స్టాండర్స్, ఉపాధ్యాయుల బోధన, అధికారుల పర్యవేక్షణ, ఎక్కువగా ఉండేది. కానీ రాను రాను విద్యాసంస్థల్లో డొల్లతనం ఏర్పడింది. మొదట 17 పాఠశాలలు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 9కి చేరింది. డిగ్రీ, పీజీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఒక్కొక్కటి మాత్రమే ఉన్నాయి. ఉపాధ్యాయుల సంఖ్య కూడా తగ్గుముఖం పట్టింది. ఒకప్పుడు ఎయిడ్ పోస్టులు ఉన్నాయి. వీటికి ప్రభుత్వం ఫండింగ్ ఇచ్చేవారు. ఈ పోస్టుల్లో పనిచేస్తే వారు పదవి విరమణ చేయడంతో వారికి వచ్చే నిధులను ప్రభుత్వం నిలిపివేసింది. ఆ తరువాత ఎంప్లాయిమెంట్ ద్వారా సింగరేణి సంస్థ ఉపాధ్యాయులను రెగ్యులర్ పోస్టుల్లో నియమించారు. 1990 తర్వాత రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకాన్ని కూడా నిలిపివేశారు. అనంతరం 2006 నుంచి బ్యాక్‌లాగ్ పోస్టులతో భర్తీ చేశారు. 2013 నుంచి రెగ్యులర్ నియాకాలు పూర్తిగా నిలిపివేసి, కేవలం కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాలు చేపట్టారు. 2022 నుంచి అడ్‌హక్ బేస్‌లో తక్కువ జీతాల పద్ధతిలో నియామకాలు చేపట్టారు. ప్రతీ ఏడాది కొత్త ఉపాధ్యాయులను అడ్‌హక్ బేసిస్‌లో తీసుకుంటున్నారు.



కొత్తగూడెంలో సింగరేణి డిగ్రీ పీజీ కళాశాల

దిగజారిన ర్యాంకులు, విద్యా నైపుణ్యం

సింగరేణి విద్యావ్యవస్థలో జరిగిన పరిణామాల ప్రభావం తీవ్రంగా పడింది. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల స్టాండర్స్‌లో కూడా తగ్గుముఖం పట్టింది. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు యూనివర్సిటీ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు వచ్చేవి. ప్రతీ ఏడాది యూనివర్సిటీ స్థాయిలో ర్యాంక్‌లతో పాటు, క్రీడలు ఇతర, కో-కరికులం పోటీల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో సింగరేణి విద్యార్థులు ప్రత్యేకతలు చాటుకునేవారు. సింగరేణి చైర్మన్‌గా బిఎస్ రామన్‌గా ఉన్న సమయంలో సింగరేణి విద్యావ్యవస్థకు శ్రీకారం చుట్టారు. కానీ రాను, రాను ఇంటర్, డిగ్రీ, పీజీ కళశాల ఉద్యోగుల మధ్య ఆధిపత్య పోరు, అంతర్గత కుమ్ములాటలతో విద్యా వ్యవస్థ తిరోగమనం వైపు మళ్లింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళా కళాశాలలను ఏర్పాటు చేశారు. అనతి కాలంలోనే ఈ కళాశాలలకు ఐఎస్ఓ 9001-2015 సర్టిఫికెట్‌తో పాటు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ పొంది న్యాక్‌లో ట్రిబుల్ ప్లస్ పొందింది. హెచ్ఆర్డీలో 2 స్టార్ రేటింగ్ పొంది ఆ తర్వాత అనేక కొత్త కోర్సులు ప్రారంభించింది. రాష్ట్ర జాతీయస్థాయిలో మంచి గుర్తింపు పొందింది. క్రీడా పోటీల్లో ఈ కళాశాల గ్రామస్థాయిలో అగ్రస్థానంలో నిలిచింది. ఎన్నో విజయాలకు కేరాఫ్‌గా ఉన్న ఈ మహిళా కళాశాల, జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల మధ్య విభేదాలు రావడం, వర్గపోరాటాలు ఆధిపత్యపోరు ఎక్కువైంది. ఈ విభేదాల మధ్య ఇటీవల ఇక్కడ పనిచేసిన ఎడ్యుకేషన్ సెక్రటరీ సైతం బదిలీ అయ్యారు. అంటే ఇక్కడ ఏ స్థాయిలో రాజకీయాలు ఉన్నాయో అర్థమవుతుంది.

గోల్డెన్ జూబ్లీ వేడుకలు రద్దు

ఈ విద్యా సంస్థలను నిర్మించి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ ఏడాది సెప్టెంబర్ 11, 12, 13 తేదీల్లో గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించాలని యాజమాన్యం నిర్ణయించింది. దీనికోసం రూ. 9.42 లక్షల నిధులు కూడా కేటాయించారు. గోల్డెన్ జూబ్లీ పురస్కరించుకుని 14 రకాల కార్యక్రమాలను నిర్వహించాలని షెడ్యూల్ కూడా రూపొందించారు. ఇప్పటికే కొన్ని యాక్టివిటీస్ పూర్తి చేశారు. విద్యార్థులు కూడా ఎంతో ఆనందంగా పూర్వ, నూతన విద్యార్థులు, అధ్యాపకులు ఒకే వేదికపైకి రావడానికి వీలుంటుందని సంబరపడ్డారు. కానీ ఈ నెల 11వ తేదీకి ముందు గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిలిపివేయాలని ఆదేశాలు రావడంతో విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర నిరాశకు గురయ్యారు. గోల్డెన్ జూబ్లీ వేడుకలు అర్ధాంతరంగా నిలిపివేయడంపై సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. ఇకనైనా యాజమాన్యం దృష్టిసారించి గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు కోరుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

ఎంపిక కమిటీని ప్రకటించిన టీఎఫ్ఏ సెక్రెటరీ జీపీ పాల్గుణ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబర్ 19 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సీనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపికలకు ఐదుగురి సభ్యులతో కూడిన ఎంపిక కమిటీని తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి, జాతీయ క్రీడాకారుడు జీపీ పాల్గుణ శుక్రవారం ప్రకటించారు. ఈ కమిటీలో ఎంసీ పాస్నెట్, డాక్టర్ వెంకన్న, భట్టు నిరంజన్, ప్రేమ్‌కుమార్, జునైద్, నరేంద్రరాజు ఉన్నారు. ఈ నెల 21న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో మధ్యాహ్నం 2.30గంటలకు ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేసి మహబూబ్‌నగర్‌లో ఈ నెల 25 నుంచి 28 వరకు జరుగు రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. కావున ఉమ్మడి ఖమ్మం జిల్లా ఫుట్‌బాల్ క్రీడాకారులు ఈ ఎంపికలకు సకాలంలో హాజరు కావలసిందిగా కమిటీ సభ్యులు కోరారు. వీరి వెంట తప్పని సరిగా ఆధార్ కార్డు, డేట్ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9949446551, 9849418849 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

శబరిమల ఆలయ నిర్వహణలో రాజకీయ జోక్యం తగదు

ఏబీపీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి.పుల్లంరాజు

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామివారి నిత్య కైంకర్యాలు ఆచార వ్యవహారాలలో రాజకీయ జోక్యాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, భక్తుల విశ్వాసాన్ని రాజకీయాలతో ముడిపెట్టవద్దని అఖిల భారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ (ఏబీపీపీ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు టి.వి. పుల్లంరాజు శుక్రవారం కోరారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత సంబంధిత కార్యకలాపాలన్నీ రాజకీయ జోక్యంతో కొనసాగుతున్నాయని, ఈ చర్య వల్ల భక్తులను ఆందోళనకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ ప్రభుత్వం ట్రావెన్‌కోర్ ట్రస్ట్ బోర్డ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 20న శబరిమలలోని పంబ వద్ద అగోలా అయ్యప్ప సంగమం నిర్వహించడాన్ని స్వాగతించారు. ట్రావెన్‌కోర్ దేవశ్వం బోర్డు 75వ వార్షికోత్సవ వేడుకలు విజయవంతం కావడానికి ఏబీపీపీ కృషి చేస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మూడు వేల మంది డెలిగేట్స్‌తో నిర్వహించే ఈ ఆధ్యాత్మిక వేడుకలకు ఆహ్వానంతో హాజరుకానున్నట్లు తెలిపారు.

సింగరేణి ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

8 కేజీల ఓవేరియన్ ట్యూమర్ తొలగింపు

వైద్యులను అభినందించిన అధికారులు

రుద్రంపూర్ (సింగరేణి), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ప్రధాన ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి శభాష్ అనిపించుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న 65 ఏళ్ల మహిళకు శుక్రవారం



శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యులు 8 కేజీల కాంప్లెక్స్ ఓవేరియన్ ట్యూమర్‌ను తొలగించారు. ఈ సందర్భంగా సింగరేణి ఆస్పత్రి వైద్యులు మాలతి, వినూత్న, కాళేశ్వర్, కృష్ణమూర్తి, రవళిలు సుమారు మూడు గంటల పాటు శ్రమించి ఆపరేషన్‌ను విజయవంతం చేశారు. వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేయడం పట్ల సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్‌రాజ్‌కుమార్ డీవైసీఎం ఉష హర్షం ప్రకటించి వైద్యులను, వైద్య సిబ్బందిని అభినందించారు.

లాభాల వాటా చెల్లించే వరకూ పోరాడుతాం!

మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

సింగరేణి భవన్‌ను ముట్టడించిన టీజీబీకేఎస్ నాయకులు

రుద్రంపూర్ (సింగరేణి), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి కార్మికులకు ఈ ఏడాది వచ్చిన లాభాల నుంచి 35శాతం బోనస్ చెల్లించేంత వరకు పోరాటాలను ఉధృతం చేస్తామని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. సింగరేణి లాభాలను ప్రకటించడంలో యాజమాన్యం ఎందుకు జాప్యం చేస్తుందని ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌ను టీజీబీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులకు నష్టం చేసే విధంగా పనిచేస్తుందని ఆరోపించారు. నికర లాభాలను ప్రకటించి కార్మికులకు 35 శాతం వాటాను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్మికుల పక్షాన పోరాడుతున్న తమ సంఘం నాయకులను ఇబ్బందులకు గురిచేసే విధంగా ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. సింగరేణి సంస్థకు ఈ ఏడాది సుమారు 6 వేల కోట్లకు పైగా లాభాలు వచ్చినట్లు ప్రాథమిక సమాచారం ఉందని తెలిపారు. యాజమాన్యం స్పందించకపోతే సింగరేణి కార్యాలయాలను ముట్టడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మిర్యాల రాజిరెడ్డి, కాపు కృష్ణ, సురేందర్‌రెడ్డి, నాయకులు గడప రాజయ్యతో పాటు 11 ఏరియాల నుంచి యూనియన్ ఉపాధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



సింగరేణి భవన్ ముందు ధర్నా చేస్తున్న టీజీబీకెఎస్ నాయకులు

పెట్రోల్‌బంక్ పనులను నిలిపివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు

దమ్మపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దమ్మపేట బస్టాండు ఆవరణలో కొద్దిరోజులుగా కాంట్రాక్టర్ పెట్రోల్‌బంక్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ నిర్మాణం నిలిపి వేయాలంటూ గ్రామస్థులు ఆందోళలు చేసినా, ఆర్టీసీ యాజమాన్యానికి వినతిపత్రం అందజేసినా పట్టించుకోలేదు. దీంతో గ్రామానికి చెందిన యువకుడు భవానీకృష్ణ ప్రజలకు ఉపయోగపడాల్సిన బస్టాండులో పెట్రోల్‌బంక్ నిర్మాణం చేపడుతున్నారని దీనిని నిలుపుదల చేయాలంటూ హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో హైకోర్టు తీర్పు వెలువడే వరకు నిర్మాణ పనులు ఆపాలని మధ్యంతర ఉత్తర్వులు ఈనెల 15న ఇవ్వగా ఆలస్యంగా అందాయి. ఆర్టీసీ యాజమాన్యం, పంచాయతీరాజ్, పెట్రోలు బంక్ యానమాన్యానికి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముదిగొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం గంధసిరి, పెద్దమండవ మున్నేరు నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు ముదిగొండ పోలీసులు కమలాపురం వద్ద ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నామని అక్రమంగా ఇసుకతరలిస్తే కఠినచర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ముదిగొండ, బోనకల్, చింతకాని పోలీస్ అధికారులతో సీపీ సమీక్ష



మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్, హాజరైన పోలీసు అధికారులు

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ, బోనకల్, చింతకాని పోలీస్‌స్టేషన్ల అధికారులతో పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ స్టేషన్లలో వచ్చే ఫిర్యాదుల ఆధారంగా వెంటనే కేసులు నమోదు చేయాలని, ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, ప్రజాభద్రత కోసం అమలు చేస్తున్న ప్రత్యేక చర్యలకు సంబంధించిన కీలక అంశాలపై దృష్టిసారించాలని తెలిపారు. అక్రమ రవాణా, దందాలు, అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. యువత మాదక ద్రవ్యాలు, వ్యసనాలు, నేర కార్యకలాపాలకు బలికాకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా సెక్టార్ పోలీసాఫీసర్లు ముందస్తు సమాచారం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా రైతులకు అందించే యూరియా పంపిణీ విషయంలో సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో సీసీఆర్బీ సీఐ స్వామి, సీఐ మురళి, తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట సొసైటీ సీఈవో సస్పెన్షన్

అశ్వారావుపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట కో ఆపరేటివ్ సొసైటీ సీఈవో విజయ్‌బాబుపై సస్పెన్షన్ వేటు వేస్తూ జిల్లా కోఆపరేటివ్ అధికారి ఏ.శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో స్టాఫ్ అసిస్టెంట్‌గా ఉన్న హేమగిరికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఆ ఉత్వరుల్లో పేర్కొన్నారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తున్నట్టు, నిధులు దుర్వినియోగం వంటి అభియోగాలు సీఈవోపై ఉన్నందున విచారణ చేపట్టడం జరిగిందని, అప్పటి వరకు ఆయనను విధుల నుండి సస్పెండ్ చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

యూరియా వెతలు.. రైతుల బారులు





అందరికీ యూరియా ఇవ్వాలని ఆందోళన చేస్తున్న రైతులు, కొణిజర్లలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి బాలాజీ, ఎస్ఐ సూరజ్

పంపిణీ కేంద్రాల వద్ద గంటల తరబడి ఎదురుచూపు

కారేపల్లిలో ఏవోను చుట్టుముట్టిన అన్నదాతలు

ఆందోళనతో సొమ్మసిల్లిన ఏవో.. ఆస్పత్రికి తరలింపు

కొణిజర్ల మండలంలో అధికారులను నిలదీసిన రైతులు

కారేపల్లి / కొణిజర్ల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతుల యూరియా కష్టాలు తప్పడం లేదు. సొసైటీలు, రైతువేదికలు తదితర పంపిణీ కేంద్రాల వద్ద వేలాది మంది బారులు తీరుతున్నారు. ఈ క్రమంలో అధికారులు కూపన్ల విధానంలో పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినా అదుపులో ఉండని పరిస్థితి. ఈ క్రమంలోనే ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలోని సహకార పరపతి సంఘ కార్యాలయంలో రైతులకు యూరియా కూపన్లు పంపిణీ చేస్తున్నారనే విషయం తెలుసుకుని వేలాది మంది రైతులు శుక్రవారం తెల్లవారు జామునుంచే బారులు తీరారు. ఈ క్రమంలో తమకు అవసరమైన యూరియా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పలుమార్లు నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. అదే సమయంలో పరిస్థితిని పర్యవేక్షించేందుకు అక్కడకు మండల వ్యవసాయశాఖాధికారి బట్టు అశోక్ రాగా.. రైతులు ఆయన్ను చుట్టుముట్టారు. సరిపడా యూరియా ఇవ్వాలంటూ ఆయనతో వాగ్వాదానికి దిగడంతో అందోళనకుగురైన అశోక్ సొమ్మసిల్లి పడ్డారు. దాంతో సొసైటీ, వ్యవసాయ శాఖ సిబ్బంది వెంటనే ఆయనను మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అయినా రైతులు ఆందోళనకు దిగి.. నినాదాలు చేయడంతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. పరిస్థితి అదుపుతప్పే అవకాశం ఉండడంతో కార్యాలయ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కారేపల్లి, కామేపల్లి, రఘునాథపాలెం ఎస్ఐలు, సిబ్బంది అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. ఇదే క్రమంలో వైరా ఏడీఏ కరుణశ్రీ కార్యాలయం వద్దకు వచ్చి రైతులు ఇందోళన చెందొద్దని, సరపడా యూరియా వస్తుందని చెప్పారు. అనంతరం ఏసీపీ తిరుపతిరెడ్డి సూచనల మేరకు సొసైటీ సిబ్బంది జిన్నింగ్ మిల్లు, సొసైటీ కార్యాలయం వద్ద కౌంటర్లు తెరిచి పోలీసు బందోబస్తు మధ్య రైతులకు కూపన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కారేపల్లి సొసైటీ సీఈవో హనుమంతరావు మాట్లాడుతూ శక్రవారం 4,014మంది రైతులు రాగా వారికి కూపన్లు పంపిణీ చేశామని, శుక్రవారం 890 కట్టలు యూరియా వచ్చిందని, మరో రెండు రోజుల్లో మండల పరిధిలోని ఐదు రైతు వేదికల్లో పది టన్నుల చొప్పున యూరియా వస్తుందన్నారు. అలాగే ఖమ్మం జిల్లా కొణిజర్ల పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం యూరియా కోసం అధికారులు కూపన్లు ఇచ్చారు. దీంతో రైతులు అధికసంఖ్యలో వచ్చారు. యూరియా మాత్రం 960 బ్యాగులు మాత్రమే వచ్చింది. వచ్చిన వారందరికీ కూపన్లు అందకపోవడంతో పలువురు రైతులు అధికారులను నిలదీశారు. సరిపడా యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల వద్దకు మండల వ్యవసాయాధికారి బాలాజీ, ఎస్ఐ సూరజ్ వచ్చి మాట్లాడారు. మరో 30టన్నుల యూరియా వస్తుందని రైతులు ఆందోళన చెందొద్దని తెలిపారు.

ఇసుక రవాణాపై కఠిన నిబంధనలు

కూపన్లు లేకుండా ట్రాక్టర్లు పట్టుబడితే కఠిన చర్యలు : ఆర్డీవో

చింతకాని, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మున్నేటి ఇసుక రవాణాపై కఠిన నిబంధనలు అమలు చేస్తున్నట్లు ఆర్డీవో నరసింహారావు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నమండవ మున్నేరు, ముదిగొండ రెవెన్యూ పరిధి గంగాపురం లంక భూములను ఆయన పరిశీలించారు. మున్నేటి నడుమ లంకలో ఏర్పాటు చేసిన గేటును, లంకతో పాటు ఇసుక రీచ్‌లో తవ్వకాలను పరిశీలించారు. డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో ఇసుక రవాణా కొనసాగుతుండటంతో సంఘంలోని మహిళలతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాయలంలో పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. కూపన్లు ఉంటేనే ఇసుక రవాణాకు అనుమతించాలని తెలిపారు. సాయంత్రం 6 గంటలు దాటిన తరువాత ఇసుక ట్రాక్టర్లు మున్నేటిలోకి వెళ్లరాదన్నారు. జారీ చేసిన ఇసుక కూపన్ మూడు రోజుల వరకే చెల్లుబాటవుతుందన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక ట్రాక్టర్ల వద్ద అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే కేసులు తప్పవన్నారు. కార్యక్రమంలో చింతకాని తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ముదిగొండ తహసీల్దార్ సునీత ఎలిజిబెత్, వైరా సీఐ సాగర్, ఎస్ఐ ఎన్.వీరెందర్, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

కారేపల్లి సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేరుపల్లి గ్రామానికి చెందిన బానోత్ భద్రుసింగ్(52) అనే రైతు రెండు రోజుల క్రితం పురుగుల మందుతాగాడు. ఆమేరకు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఆత్మహత్యకు సంబంధించి కుటుంబ కలహాలే కారణమని పోలీసులు అన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

హైవోల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

తల్లాడ, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): హైవోల్టేజీతో విద్యుత్ సరఫరా కావడంతో శుక్రవారం ఉదయం మండలంలోని మల్లారం గ్రామంలో రూ.లక్షల విలువైన విద్యుత్‌మోటార్లు, గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద న్యూట్రల్ వైరుతెగి తలెత్తిన హైవోల్టేజీ సమస్యతో మల్లారంలో సుమారు వంద ఇండ్లలోని ఫ్యాన్లు, మోటార్లు, టీవీలు, ఆర్వోవాటర్‌ప్లాంట్లు, సెల్‌ఫోన్ చార్జర్లు దగ్ధమవ్వడంతో తీవ్రనష్టం వాటిల్లింది. ఈ నష్టాన్ని విద్యుత్ అధికారులు పరిశీలించి పరిహారం అందజేయాలని బాధితులు కోరుతున్నారు.

అన్నదమ్ముల కుటుంబాల మధ్య ఘర్షణ

అన్న కుటుంబ సభ్యులపై నాపరాయితో దాడి చేసిన తమ్ముడు, ఇరువురికి గాయాలు

తల్లి బంగారం విషయంలో ఘర్షణ..!


బూర్గంపాడు, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల కుటుంబాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో అన్న కుటుంబసభ్యులపై తమ్ముడు దాడికి పాల్పడిన ఘటన ఈ నెల 17న చోటుచేసుకోగా.... ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈదాడి ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బూర్గంపాడు మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆసుల అంజిరెడ్డి కుటుంబసభ్యులను అతని బాబాయి రామకృష్ణారెడ్డి తరచూ తిడుతుండగా అంజిరెడ్డి తల్లి పద్మ ఈనెల 17న సాయంత్రం సమయంలో వారిని ప్రశ్నించింది. దీంతో రామకృష్ణారెడ్డి అతని భార్య రమణమ్మ, కుమారుడు శ్రీనివాసరెడ్డితో కలిసి అంజిరెడ్డి ఇంటి మీదకు వచ్చి అసభ్య పదజాలంతో తిడుతూ చంపుతామని బెదిరించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో రామకృష్ణరెడ్డి అంజిరెడ్డి, అతని తల్లి పద్మపై నాపరాయితో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 ద్వారా భద్రాచలం తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. బాధితుడు అంజిరెడ్డి గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా దాడికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గామారింది. వాగ్వాదం చోటు చేసుకున్న ఇరువురి అన్నదమ్ముళ్ల తల్లి నాగమ్మ ఏపీలోని ప్రకాశం జిల్లా ముళ్లమూరులో ఉంటున్నట్లు సమాచారం. పెద్ద కుమారుడు నాగిరెడ్డి కుటుంబం అవసరాల నిమిత్తం తన తల్లిని నగదు అడగగా నగదు లేకపోవడంతో తన బంగారాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టుకోమని ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో అప్పటి నుంచి అన్నదమ్ముల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే దాడి జరిగినట్లు పలువురు పేర్కొంటున్నారు. దాడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండడంతో....రక్తసంబంధాన్ని మరిచి స్వంత అన్న కుటుంబసభ్యులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పలువురు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

ప్రణాళికాబద్ధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

జిల్లా కలెక్టర్లతో సీఈవో వీడియో కాన్ఫరెన్స్

కొత్తగూడెం కలెక్టరేట్/ ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు.శుక్రవారం ఐడీవోసీ కార్యాలయం నుంచి కలెక్టర్ జితేష్ వి. పాటిల్ వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ పోలింగ్ బూత్‌స్థాయిలో 2002 ఎస్ఐఆర్ డేటాను 2025 డేటాతో కంపేర్ చేసుకోవాలని ఈ రెండు జాబితాలో కామన్‌గా ఉన్న పేర్లు మినహాయించి 2002 తర్వాత ఓటరుగా నమోదైన వారి వివరాలను క్షేత్రస్థాయిలో మారోసారి ధృవీకరించాల్సి ఉంటుందన్నారు. ఎస్ఐఆర్ 2002, ప్రస్తుత ఓటరు జాబితాలో కామన్‌గా ఉన్న పేర్లకు సంబంధించి ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రొఫార్మా ప్రకారం రిపోర్టు తయారు చేయాలని, ఎస్ఐఆర్ సంబంధించి డెస్క్ వర్క్ సెప్టెంబరు 24నాటికి పూర్తి చేయాలని అన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పాటిల్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఎస్ఐఆర్ సంబంధించి డెస్క్‌వర్క్ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఎలక్షన్ సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఏఈఆర్‌వోలు ధారా ప్రసాద్, పుల్లయ్య, ఎన్నికల నిర్వహణ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం కలెక్టరేట్ నుంచి...

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్ పాల్గొన్నారు.



స్నేహితురాలి కుటుంబానికి ఆర్థికసాయం

కామేపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితురాలి కుటుంబానికి తోటి స్నేహితులు మేమున్నాం అంటూ కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. కామేపల్లి హైస్కూల్‌లో 2006లో పదోతరగతి చదివిన గూడెంశెట్టి ఉమా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు ఆర్థికసాయం అందించేందుకు నిర్ణయించారు. మొత్తంగా రూ.14వేలు సేకరించారు. కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అజ్మీరా శివ, యనమాల రాజు, గంపల రఘు, బుట్టి షాహిన్, జక్కంపుడి సింధు, మేకల కమల పాల్గొన్నారు.

విద్యుత్ అధిక బిల్లులను రద్దు చేయాలి

ఎస్ఈ కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): రెండు పడకల ఇళ్లకు అధికంగా విద్యుత్ బిల్లులు వస్తున్నాయని అధిక బిల్లులను రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, ఖమ్మం నగర కార్యదర్శి ఎస్కే జానిమియా డిమాండ్ చేశారు. శుక్రవారం టీజీఎస్పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విద్యుత్ మాఫీ 200 యూనిట్లులోపు మల్లెల మడుగులో అమలు కావటం లేదని విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలన చేయాలని కోరారు. నాయకులు నానబాల రామకృష్ణ, ఏనుగు గాంధీ, నూనె శశీదర్, సతీష్‌రెడ్డి, బోడా వీరన్న, యండి జాకీర్, కృష్ణమూర్తి, ఉపేందర్,మాలకొండయ్య,రవి,యాకూబ్, బాషా, పర్వీన్, తులసి, పూజిత పాల్గొన్నారు.



ధరల బోర్డు ఒక్కరోజుకే పరిమితం!

- రెండో రోజు ఖాళీగా దర్శనం
- వీధి వ్యాపారుల ప్రాంగణంపై అధికారుల హడావిడే
- నెవ్వెరపోయిన నగర ప్రజలు
- శనివారం నుంచి ఏర్పాటు: సుజాతరాణి, టీఎంసీ





గురువారం నమోదు చేసిన ధరల బోర్డు, శుక్రవారం నమోదు చేయని దృశ్యం

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పాతబస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణంలో కూరగాయల ధరల బోర్డు ఒక్క రోజుకే పరిమితమైంది. రెండో రోజు కూరగాయాలకు వెళ్లిన వారికి ఖాళీ ధరల బోర్డు దర్శనమిచ్చాయి. దీంతో నగర ప్రజలు నెవ్వర పోయారు. ఖమ్మం కార్పొరేషన్ అధికారులు తీసుకున్న నిర్ణయాలు అమలు కాకపోవటంపై ఎవ్వరి వత్తిడి ఉందనే చర్చ జరుగుతుంది. ఖమ్మం పాతబస్టాండ్ సెంటర్‌లో వీధి వ్యాపారుల ప్రాంగణం ద్వారా కూరగాయల అమ్మకాలు జరుగుతున్నాయి. అయితే ఏ కూరగాయాలు ఏ ధరలకు అమ్మకాలు జరుపుతున్నారనే బోర్డులు లేక పోవటంతో పలువురు సమస్యను 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఈనెల14న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ధరలు అడిగితే దంచుడే' కథనంపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించారు. వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని ఖమ్మం కార్పొరేషన్ కూరగాయాల మార్కెట్‌గా మార్పులు చేశారు. మహాత్మాగాంధీ మహిళా సమాఖ్యకు నిర్వాహణ బాధ్యతలను అప్పగించారు. దీంతో గురువారం ధరల బోర్డును ఏర్పాటు చేశారు. కూరగాయల అమ్మకాలు పారదర్శకంగా జరిగాయి.

దోచుకునేందుకు కుదరదని..

అయితే ధరల బోర్డును ఏర్పాటు చేయటంతో లాభాలు తక్కువగా వస్తున్నాయని కొంతమంది కూరగాయల వ్యాపారులు స్థానికంగా ఉన్న ఓ కాంగ్రెస్ నాయకులతో అధికారులపై వత్తిడి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. సదరు నాయకులు రాష్ట్ర ప్రజాప్రతినిధులు, కేఎంసీ అధికారులను కలిసి పర్మిషన్ తీసుకున్నానని ధరల బోర్డులు పెట్టోద్దని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వీధి వ్యాపారుల ప్రాంగణంలో ధరల బోర్డుపై కూరగాయల ధరలను నమోదు చేయలేదు. దీంతో కూరగాయలు కొనుగోలుకు వచ్చిన ప్రజలు నెవ్వర పోయారు. మెప్మా ఆధ్వర్యంలో సేకరించాల్సిన ఆధార్‌లు సేకరణ నుంచి దుకాణాలు కేటాయింపు సిపారసుల్లోనూ నాయకులు జోక్యంపై విమర్శలు వెలువడుతున్నాయి.

ఈ విషయంపై సంబంధిత అధికారి శివ రామకృష్ణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా కొంతమంది ధరలు రాయకుండా ఫోన్లు చేశారని తెలిపారు. మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణిని వివరణ కోరగా శనివారం నుంచి ధరల బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలను దోచుకునేందుకు వ్యాపారుల ప్రయోజనాల కోసం ధరల బోర్డును ఏర్పాటు చేయక పోవటంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేశారు.

మోతాదులోనే యూరియా వేయాలి

జిల్లావ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య

కామేపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు మోతాదు ప్రకారమే యూరియా వాడకం చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య సూచించారు. శుక్రవారం ముచ్చర్ల రైతువేదికలో యూరియా పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. యురియా అందుబాటులో ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. రైతులు కూడా మోతాదుకు మించి యురియా వాడితే పంట నష్టం జరుగుతందని వివరించారు. విడతల వారిగా యురియా సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తారాదేవి, ఏఈఓ దీపక్‌రెడ్డి, ఇల్లెందు మార్కెట్‌కమిటీ డైరెక్టర్ గబ్రూ, సీఈఓ గాదె నాగయ్య, శ్యామ్, సత్యనారాయణ రైతులు దామోదర్‌నెడ్డి, ఇమ్మడి రామనాథం, మన్నె వెంకటేశ్వర్లు, కాత్రాల రాంబాబు, రాజు తదితరులు ఉన్నారు.



పీఎం ఆవాస్ యోజన గ్రామీణ్ సర్వే వారంలో పూర్తి చేయాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ సర్వే ప్రక్రియ వారం రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో కలెక్టర్, ప్రధానమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన సర్వేపై శుక్రవారం అధికారులతో సమీక్షించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ సర్వేలో భాగంగా జిల్లాలో 571 గ్రామాల్లో ఇప్పటి వరకు 69 శాతం (30,434) మేరకు సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. పెండింగ్ 13,663 ఇళ్లసర్వేను మరో వారంలో 100 శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామపాలన అధికారులు విధులలో చేరిన నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తగ్గుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణప్రాంతాల్లో వనమహోత్సవం కార్యక్రమం క్రింద నాటిన మొక్కలకు ట్రీ గార్డ్ లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, అధికారులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

ఖమ్మంలీగల్,సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): బోనకల్ మండలం ముష్టికుంట గ్రామానికి చెందిన చిట్టం శెట్టి వెంకట్ నారాయణకు చెల్లని చెక్కు కేసులో ఆరునెలలు జైలు శిక్షతో పాటు ఫిర్యాదికి పదిలక్షల రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలని ఖమ్మం ఒకటో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి బెక్కమ్ రజని తీర్పు చెప్పారు. రఘునాదపాలెం మండలం శివాయగూడెం గ్రామానికి చెందిన ఫిర్యాది పొన్నం శేషగిరిరావు వద్ద నిందితుడు 2021లో రూ.18లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అదేఏడాది నిందితుడు పదిలక్షల రూపాయలకు చెక్కు జారీ చేశాడు. అట్టి చెక్కును ఫిర్యాది తన బ్యాంక్ ఖాతాలో జమ చేయగా, సరిపడా నగదు లేనందున తిరస్కరణకు గురైంది. తరువాత ఫిర్యాది తన న్యాయవాది కొల్లిపాక రమేష్ కుమార్ ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కేసు దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావటంతో పైవిధంగా తీర్పు చెప్పారు.ఇదే నిందితుడికి మరో కేసులో ఆరు నెలలు జై శిక్షతో పాటు ఫిర్యాదుకి రూ.10లక్షల నష్టపరిహారం కింద చెల్లించాలని ఇదే కోర్టు న్యాయాధికారి బెక్కమ్ రజని తీర్పు చెప్పారు.

విద్యార్థికి ఆర్థిక చేయూత

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో తండ్రిని కోల్పోయిన ఎస్‌బీఐటీ కళాశాల విద్యార్థి ఈ.వీరభద్ర సుజిత్‌కు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ఆర్థికసాయం అందించారు. గత మేనెలలో వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన ప్రమాదంలో సుజిత్ తండ్రి శంకర్రావు మృతి చెందారు. ఈ నేపథ్యంలో విద్యార్థి చదువులకు ఇబ్బంది కలగకుండా ఉండేలా నేషనల్ ఇన్సురెన్స్ ద్వారా రూ.2లక్షల చెక్కును శుక్రవారం కళాశాలలో విద్యార్థికి అందించారు. ఏదైనా ప్రకృతి వైపరీత్యాల వల్ల తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు తమ కళాశాల అండగా ఉంటుందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి తెలిపారు.

ఆమరణ నిరాహార దీక్ష పోస్టర్ ఆవిష్కరణ

ఖమ్మంచర్చికాంపౌండ్, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న జాతీయ బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఆసంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ చేయబోతున్న ఆమరణ నిరాహారదీక్ష పోస్టర్‌ను శుక్రవారంజిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆవిష్కరించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఆరోతరగతికి వచ్చినా.. క్యాట్, బ్యాట్ చదవటం రాదు!

- ఉపాధ్యాయులపై జడ్పీసీఈవో దీక్షారైనా తీవ్ర ఆగ్రహం
- విద్యార్థుల హాజరు శాతం తక్కువగా ఉన్నా పట్టించుకోవటం లేదు
- నేలకొండపల్లి, రాజేశ్వరపురం ఉన్నత పాఠశాలల తనిఖీ

నేలకొండపల్లి,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠాలు చెపుతున్నారా? లేదా? ఏం చేస్తున్నారు? అంటూ జడ్పీసీఈఓ దీక్షారైనా నేలకొండపల్లి బాలికల, రాజేశ్వరపురం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జడ్పీ సీఈఓ దీక్షారైనా తొలుత నేలకొండపల్లి బాలికల ఉన్నత పాఠశాలను, అనంతరం రాజేశ్వరపురం ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆరో తరగతి విద్యార్థులు సామర్థ్యాన్ని పరీక్షించారు. సీఈవో అడిగిన ఏచిన్న ప్రశ్నకు పిల్లలు జవాబివ్వక పోవటంతో సీఈఓకు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్నప్పటికీ క్యాట్.. బ్యాట్ లాంటి చిన్న,చిన్న పదాలను పిల్లలు చదవలేక పోతున్నారు. అసలు మీరు పాఠాలు చెపుతున్నారా? లేదా? అంటూ ఆగ్రహంగా ప్రశ్నించారు. చదువు చెప్పటం లేదు, విద్యార్థుల హాజరు చాలా తక్కువగా ఉన్నప్పటికీ పట్టించుకోవటం లేదు. అసలేం చేస్తున్నారు.. అంటూ ప్రశ్నించారు. తీవ్రఅసంతృప్తి వ్యక్తం చేశారు. నెలరోజుల్లో తిరిగి పాఠశాలను తనిఖీ చేస్తానని, అప్పటికల్లా విద్యార్థుల సామర్థ్యం పెరగాలని, హాజరుశాతం కనీసంగా 90 శాతం ఉండాలని లేని పక్షంలో తీవ్రచర్యలుంటాయని ప్రధానోపాధ్యాయులు రత్నకుమారి, కృష్ణారావును హెచ్చరించారు.

ఎంఈఓపై ఆగ్రహం...

మండల విద్యాధికారిగా మీరు పాఠశాలలను తనిఖీ చేస్తున్నారా?లేదా? విద్యార్థుల హాజరు శాతం, సామర్థ్యాన్ని పరిశీలిస్తున్నారా? లేదా? అంటూ ఎంఈఓ చలపతిరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు పాఠశాలలను తనిఖీ చేస్తుండాలని, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తుండాలని సీఈఓ దీక్షారైనా, ఎంఈఓ చలపతిరావును ఆదేశించారు.

మధ్యాహ్న భోజనం భేష్...

విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం బాగుందని దీక్షారైనా కితాబిచ్చారు. ఎంపీడీఓ మర్రి ఎర్రయ్య, ఎంఈఓ బాలిన చలపతిరావులు జడ్పీ సీఈఓ వెంట ఉన్నారు.



నేలకొండపల్లి బాలికల పాఠశాలలో విద్యార్థిని సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న జడ్పీ సీఈవో

ఉపాధ్యాయుల అరెస్టు సరికాదు: యూటీఎఫ్

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని మసబ్ ట్యాంక్‌లోని గిరిజన సంక్షేమశాఖ కార్యాలయాన్ని ముట్టడించడానికి వెళ్తున్న ఉపాధ్యాయులను అరెస్టు చేయటం సరికాదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి. నాగేశ్వరరావు ఖండించారు. ఏడాదిగా అనేక ప్రాతినిధ్యాలు చేసినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని, పదిరోజుల క్రితం ప్రభుత్వానికి నోటీస్ ఇచ్చి పోరాటానికి పూనుకున్నామన్నారు. ప్రభుత్వం అప్రజాస్వామిక చర్యలు మానుకొని, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆహ్లాదకరంగా పార్కుల నిర్మాణం



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రజలు ఆహ్లాదంగా ప్రశాంతంగా సేద తీరేందుకు అనువుగా పార్కుల నిర్మాణం జరపాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం 54వ డివిజన్‌లో కమిషనర్ పర్యటించారు.నిర్మాణం జరుగుతున్న పార్కును పరిశీలించారు. భవనం, రహదారులు నాణ్యతగా నిర్మాణం చేయాలని, పార్కులో పచ్చని మొక్కలు,పూలమొక్కలు అందంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఖానాపురంలో నిర్మాణం జరుగుతున్న అర్బన్ ఆరోగ్య కేంద్రాన్ని కమిషనర్ తనిఖీలు చేశారు. భవన నాణ్యతను పరిశీలించారు. ప్రజలకు సకాలంలో స్థానికంగా వైద్యసేవలు అందించేందుకు నగరంలోని అన్ని ప్రాంతాల్లో అదనంగా అర్బన్‌ఆరోగ్య కేంద్రాల భవనాలు నిర్మాణం జరుపుతున్నామని తెలిపారు.

రూరల్ మండల సేవలన్నీ ఒకేచోట

- సమీకృత భవన నిర్మాణాలకు లైన్ క్లియర్
- తరుణీహట్‌లో నూతన హంగులతో సేవలు
- రూ.46కోట్లతో జీప్లస్‌టూ అంతస్థుల నిర్మాణం
- త్వరలో మంత్రి పొంగులేటి శంకుస్థాపన



తరుణిహట్‌లో సమీకృత భవనం నిర్మించబోయే ప్రదేశం

ఖమ్మంరూరల్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మండల సమీకృత భవన నిర్మాణాలకు లైన్‌క్లియర్ అయింది.అయిదేళ్లుగా మండల కార్యాలయాలన్నీ ఒకేచోట నిర్మించాలన్న విషయంలో రాజకీయ నాయకుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవటంతో ఇన్నాళ్లు నిర్మాణాల విషయంలో కొలిక్కి రాలేదు. అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, వామపక్ష నాయకులు తమతమ ప్రాబల్యం కోసం భవన నిర్మాణాలు, ఒక కొలిక్కి రాకుండా ఆపిన విషయంఅప్పట్లో పెద్దదుమారం లేపింది. ప్రస్తుతం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని తరుణీహట్‌లో మండల సమీకృత భవన నిర్మాణాలకు లైన్‌క్లియర్ చేశారు. భవన నిర్మాణాలకు పరిపాలనా పరమైన అనుమతులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.త్వరలో మంత్రి త్వరలోనే శంకుస్థాపన చేయనున్నారు.

ప్రజలకు అందుబాటులోకి 16 శాఖలు

ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని వరంగల్‌క్రాస్ రోడ్డులోని తరుణిహట్‌లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఒకేచోట నిర్మించేందుకు రూ.46కోట్లతో ఇంటిగ్రేటెడ్ జీప్లస్ టూ భవనాలు నిర్మాణాలకు ప్రభుత్వం పరిపాలనా పరమైన అనుమతులను మంజూరు చేసింది. దీంతో తరుణిహట్ ప్రాంగణంలో నూతన భవన నిర్మాణాలకు లైన్ క్లియర్ అయింది. ఈ జీప్లస్‌టూభవనాలలో మొత్తం16శాఖలు ఇక్కడే ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ప్రతీ కార్యాలయానికి సంబంధించిన ఫైల్స్ పెట్టేందుకు ప్రత్యేక స్టోరేజ్ రూంలు నిర్మించనున్నారు.

కార్యాలయాలు ఇవే

మండల పరిషత్ కార్యాలయం, మునిసిపల్ కార్యాలయం,రెవెన్యూ,ఎడ్యూకేషన్,అగ్రికల్చర్ (ఏడీ, ఏఓ), హర్టీకల్చర్, చైల్డ్ ప్రాజెక్టు డెవలప్‌మెంట్ కార్యాలయం,ఫిషరీస్, సబ్‌రిజిస్టార్ కార్యాలయం,రోడ్లు,భవననిర్మాణాల కార్యాలయం, పంచాయతీరాజ్ సబ్‌డివిజన్, ఇరిగేషన్ సబ్‌డివిజన్,మిషన్ భగీరథ సబ్ డివిజన్ కార్యాలయం,ఏసీపీకార్యాలయం,కో-ఆపరేటీవ్ సొసైటీ కార్యాలయం, లైబ్రరీ, పోస్టల్ కార్యాలయాలను నిర్మించనున్నారు.

ప్రభుత్వ పాలన ప్రజల వద్దకే

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రూరల్ ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణాలతో ప్రభుత్వ పాలన ప్రజల వద్దకే అన్నట్లుగా ఉంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట నిర్మించడం ద్వారా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటాయి. గతంలో మండలంకు సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాలు అక్కడోకటి అక్కడోకటి విసిరేసినట్లుగా ఉండేవి. దీంతో మండల ప్రజలు వివిధ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగలేక అలసి పోయేవారు. మంత్రి పొంగులేటి చొరవతో వరంగల్ క్రాస్‌రోడ్డులో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణం ఏర్పాటు చేసి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఏర్పాటు చేస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

తిరుమలాయపాలెం, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని టీడీపీ జిల్లానాయకులు కొండబాల కరుణాకర్ కోరారు. శుక్రవారం తిరుమలాయపాలెంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రెండోవిడత ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో పార్టీలకతీతంగా గుర్తించి ఇళ్లు ఇవ్వాలన్నారు. యూరియా కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు కావాల్సిన యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సమావేశంలో పార్టీనాయకులు కొప్పుల వెంకటరావు, మల్లీడి రమేష్, మల్లీడి నాగన్న, శోభారావు, కె.భిక్షం పాల్గొన్నారు.

మోడరన్ కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రవి



కామేపల్లి,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): మోడరన్ కబడ్డీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జిల్లా అధ్యక్షుడిగా కామేపల్లి మండలం కెప్టెన్ బంజరగ్రామానికి చెందిన ఆరెంరవి నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కుంభం రామిరెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసం రంగారావు, ట్రెజరర్‌గా అన్నపురెడ్డి కృష్ణ కమిటీలో ఎన్నుకున్నట్లు తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బషీరుద్దీన్

నేలకొండపల్లి,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి తీవ్ర నష్టం కలిగించేలా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన విద్యావిధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్.బషీరుద్దీన్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ 18వ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధ్యయనం, పోరాటం లక్ష్యంతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు మంచి నడవడికతో ఉద్యమ స్ఫూర్తితో సమస్యలను ప్రతిఘటిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు పొనుకుల సుధాకర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్నఫీజురీయంబర్స్‌మెంట్ ఎనిమిదివేల కోట్లను విడుదల చేయాలన్నారు. సభలో జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ నాయకులు వరుణ్‌కుమార్, హరీష్, నికిత,సాయికుమార్, గోపి, నిఖిల్, అఖిల్, శివ, ప్రసాద్ పాలేరు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బషీరుద్దీన్

మేయర్‌ను కలిసిన టీఎన్జీవోస్ కమిటీ

ఖమ్మంకార్పొరేషన్,సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎన్నికైన టీఎన్జీవోస్ నగర పాలక సంస్థ ఉద్యోగుల కమిటీ మర్యాదపూర్వకంగా మేయర్ పునుకొల్లు నీరజను కలిశారు. శుక్రవారం కేఎంసీ కార్యాలయానికి సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, బుల్లెట్ శ్రీనివాసరావు, కేఎంసీ కమిటీ సభ్యులు చేరుకున్నారు. మేయర్ చాంబర్ వద్దకు వెళ్లి పూలమొక్కను అందించారు.

ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్ కమిటీ వినతి

ఖమ్మంలీగల్,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి):ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్ కమిటీ తరపున అధ్యక్షుడు తాళ్ళూరి దిలీప్ చౌదరి శుక్రువారం ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కోర్టుఎదుట రెండు నెలలుగా జరుగుతున్న డ్రెయినేజీ పనులు పూర్తయినా, నెల రోజులుగా మట్టి, చిత్త రాళ్ల అలాగే నిర్లక్షంగా వదిలేయడం వల్ల కోర్టుకు వచ్చే ప్రజలు, కక్షిదారులు, న్యాయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. మట్టి, రాళ్లు తొలగించడం, కోర్టు ఎదుట పార్కింగ్ మార్జిన్ లైన్ వేసి వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించడం, స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సట్టు వెంకటరమణ, కొడూరి మన్మధరావు, కొల్లాటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రావాల్సినంత రాలే.. కొరత తీరలే..

(5వ పేజీ తరువాయి)

మొదలవుతుంది. జిల్లాలో వానాకాలం సాగు ఏప్రిల్ నుంచి మొదలై సెప్టెంబరు చివరితో ముగుస్తుంది. గతేడాది వానాకాలంలో ఏప్రిల్‌లో 94మె.ట, మేలో 270.మె.ట, జూన్‌లో 1663మె.ట, జూలై 8613మె.ట., ఆగస్టులో 13,480మె.ట., సెప్టెంబరులో 10,401మె.ట. రావడం జరిగింది. ఈఏడాది వానాకాలం సీజన్‌లో ఏప్రిల్‌లో 314మె.ట., మేలో 407మె.ట., జూన్‌లో2292మె.ట., జులైలో 12,424మె.ట., ఆగస్టులో 8887 మె.ట.,సెప్టెంబరులో ఇప్పటి వరకు 4,806 మె.ట వచ్చింది. ఇంకా రావాల్సిన ఎరువు జిల్లాకు రాలేదు. మొత్తంగా 41వేల మె.ట.కుగాను 30,200 మె.ట వచ్చింది. ఇంకా 10వేల మెట్రిక్‌టన్నులకు ఎరువు జిల్లాకు రావాల్సి ఉంది. ఇది వస్తే ఎరువుల కొరత ఉండేది కాదు. కేంద్రం నుంచి రాష్ట్రానికి, జిల్లాకు సరిపడా ఎరువుల రాకపోవడంతో యూరియాకొరత ప్రధానంగా నిలిచింది.

ఆశాజనకంగా సాగు..

ఈఏడాది జిల్లాలో సుమారు 3లక్షల ఎకరాల్లో వరి, 2.50లక్షల ఎకరాల్లో పత్తి, 10వేల ఎకరాల్లో మొక్కజొన్న, 18వేలఎకరాల్లో పెసర, వాణిజ్య, ఆహార, పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్లతోటలు అన్నీ కలిపి సుమారు 6.34 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. దీంతోపాటు ఈసారి పోడుభూముల్లో కూడా రైతులు పత్తి,మొక్కజొన్న భారీగానే వేశారు. అందువల్ల ఎరువుల వినియోగం పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న యూరియా డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని జిల్లా వ్యవసాయశాఖ ముందస్తు ప్రణాళిక సిద్ధంచేసింది. గతేడాది రబీలో 72వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు వినియోగించారని,ఈఏడాది 85 వేలమె.ట. యూరియా అవసరం ఉంటుందని ప్రతిపాదనలు పంపినట్టు జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.జిల్లాలో ఎరువులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామని చెప్పారు.

టీజేఎస్ జిల్లా అడహక్ కమిటీ రద్దు

ఖమ్మంచర్చికాంపౌండ్, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనసమితి జిల్లా అడహక్ కమిటీని రద్దు చేస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. త్వరలో కొత్త కమిటీలు వేస్తామన్నారు.

బాధిత కుటుంబానికి యాదవ యూత్ చేయూత



వైరా, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ ఒకటో వార్డులో వృద్ధురాలు శాంతమ్మకు ద్వారకానగర్‌కు చెందిన యాదవ యూత్ ఆధ్వర్యంలో బియ్యం, కూరగాయలను అందజేశారు. ఎలాంటి పనులు చేసుకోలేక నిస్సహాయ స్థితిలో ఉన్న శాంతమ్మకు తాము అండగా ఉంటామని ఆ యూత్ నాయకులు హామీ ఇచ్చారు. మూడుముంతల సైదులు, జాల పుల్లారావు, తోటకూర వీరబాబు, మూడుముంతల అనిల్, చీమల రాకేష్, వినయ్, సంపసాల శ్రీను, విక్రాంత్, సన్నీ, మురళీ, అజయ్ పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా కల్లూరు డ్రైయినేజీ వ్యవస్థ

- వర్షం వస్తే ఇళ్లలోకి చేరుతున్న వరద
- ప్రతిపాదనలకే పరిమితమైన ఆధునీకీకరణ నిధులు
- పట్టించుకోని అధికారులు



వరద నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాగమయి (ఫైల్ ఫొటో)

కల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మునిసిపాలిటీ పరిధిలో డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వర్షం కురిస్తే వరద నీరు ఇక కల్లూరు పట్టణంలోని పలు ప్రధాన రహదారులపై చేరడమే కాక గృహాల్లోకి చేరుతోంది. దీంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా కల్లూరు పట్టణంలో డ్రైయినేజీ వ్యవస్థ నిర్మించి 25 సంతవ్సరాలు కావస్తోంది. నాటి జనావాస ప్రాంతాలను పరిగణలోకి తీసుకుని అప్పట్లో రహదారులపై నిర్మించిన డ్రైయినేజీల విస్తీర్ణం తక్కువ స్థాయిలో ఉన్నాయి. కాలక్రమంలో జనాభా, గృహాల సంఖ్య పెరగడంతో నాటి డ్రైయినేజీలు పరిమితంగా మారాయి. దీంతో గృహాల్లో వినియోగించిన మురికి నీరు కూడా ముందుకు పారుదల కాని పరిస్థితి. తాజాగా కల్లూరు మునిసిపాలిటీగా ఏర్పడడంతో ఆ స్థాయిలో రహదారులపై తగిన స్థాయిలో డ్రైయినేజీలు సరిగా లేవు. ఉన్న డ్రైయినేజీల్లో విపరితంగా పూడిక పేరుకుపోయింది. కల్లూరు పట్టణంలో శాంతినగర్,



అంబేద్కర్‌నగర్, ఖాన్‌ఖాన్‌పేట, కప్పలబందం రహదారి వైపున డ్రైయినేజీ పూర్తిగా లోపించింది. స్టేట్ హైవే రహదారిపైన గల డ్రైయినేజీలలో విపరితంగా పూడిక పేరుకుపోయింది.

రహదారులపై వరదనీటిని పరిశీలించిన ఎమ్మెల్యే

ఇటీవల కురిసిన భారీ వర్షంతో కల్లూరు పట్టణంలో పలు రహదారులపై వరదనీరు పోటెత్తింది. గృహాల మధ్యన నీరు చేరడం, దీనికి తోడు మురికి నీరు నిల్వ ఉండడం జరుగుతోంది. ఇలా డ్రైయినేజీ వ్యవస్థ లోపంతో ప్రజానీకానికి ఎదురవుతున్న ఇబ్బందులను స్వయంగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి క్షేత్రస్థాయిలో ఇటవల సందర్శించి పరిశీలించారు. తాత్కాలికంగా ఆయా డ్రైయినేజీల్లో నిల్వ ఉన్న నీటిని మాత్రమే అధికారులు తొలిగించారు. అంత వరకే పరిమితమయ్యారు కాని శాశ్వత పరిష్కారం చూపని పరిస్థితి.

ప్రతిపాదనలకు పరిమితమైన నిధులు..

కల్లూరు మునిసిపాలిటీ పరిధిలో డ్రైయినేజీ వ్యవస్థను ఆధునీకరించేలా అధికారులు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కాని నేటి వరకు ఆ నిధులు ప్రభుత్వం తరుపున మంజూరు కాని పరిస్థితి. కొత్తగా ఏర్పడిన మునిసిపాలిటి పరిధిలో సుమారు రూ.15 కోట్లతో డ్రైయినేజీలు నిర్మించాలని ప్రతిపాదించి నెలలు గడిచిన ఇంతవరకు ప్రభుత్వ స్థాయిలో నిధులు మంజూరు కాకఅధికారులు ఏమి చేయలేని పరిస్థితి.

నిధులు రాగానే డ్రైయినేజీ వ్యవస్థను ఆధునీకరిస్తాం

నందిశెట్టి నాగేశ్వరరావు, మునిసిపాలిటీ మేనేజర్, కల్లూరు



కల్లూరు మునిసిపాలిటీ పరిధిలో డ్రైయినేజీ వ్యవస్థ ఆధునీకరణకు తగిన స్థాయిలో నిధుల ఆవశ్యకతపై అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. నిధులు మంజూరు కాగానే డ్రైయినేజీ వ్యవస్థను ఆధునీకరణ చేస్తాం. వరదనీరు రహదారులపై చేరిన సమయంలో తాము వెంటనే స్పందించి తగిన విధంగా చర్యలు తీసుకుంటునే ఉన్నాం.

మహిళలకు రేవంతన్న భరోసా

- సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



మహిళలకు కుట్టుమిషన్లు అందిస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళల కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారని సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి మునిసిపాలిటీలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలతోపాటు క్రిష్టియన్ మహిళలకు కుట్టుమిషన్లను ఆమె చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికస్వావలంభన సాధించాలనే ఉద్దేశ్యంతో మహిళలకు ఎన్నోఎన్నో పథకాలను అమలు చేస్తూ వస్తున్నామని, డ్వాక్రా మహిళల వలే మహిళా మార్ట్‌ను కూడా సత్తుపల్లిలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మహిళలు ఉన్నతంగా ఉంటేనే కుటుంబం బాగుపడుతుందని, అప్పుడే సమాజంలో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మైనారిటీ సంక్షేమ జిల్లా అధికారి ఎండీ.ముజాహిద్, మునిసిపల్ కమిషనర్ కొండ్ర నర్సింహ్మా, ఎంపీడీవో చిన్న నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్‌తో పాటు లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి ఆశయాలతో ఉద్యమిస్తాం



మహాసభలో ప్రసంగిస్తున్న పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్

కల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అమరుడైన తమ నేత జార్జిరెడ్డి ఆశయాల స్ఫూర్తితో విద్యార్థుల, మహిళల సమస్యలపై ఉద్యమ బాటలో ముందుకు సాగుదామని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ పిలుపు నిచ్చారు. కల్లూరులో శుక్రవారం పీడీఎస్‌యూ మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ దేశంలో ప్రధాని మోదీ మతోన్మాద రాజ్యస్థాపనతో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. స్కిల్ ఇండియా పేరుతో విద్యార్థును మోసం చేసేందుకు విద్యారంగాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్ర పాలకులు తాకట్టు పెడుతున్నారని అన్నారు. దేశంలోని యూనివర్శిటీల నూతన ముసాయిదాను అమోదించే ప్రక్రియను కొనసాగిస్తున్న తరుణంలో అరుదైన తమ నేత జార్జి ఆశయాలతో ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపు నిచ్చారు. విద్యరంగంలో కేంద్ర, రాష్ట్రం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై విద్యార్థిలోకం ఉద్యమించాలిని పిలుపు నిచ్చారు. పీడీఎస్‌యూ నాయకులు శశికిరణ్, అభిలాష్, వినయ్, అల్తాఫ్ నగేష్, రేణుక పాల్గొన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

ఏన్కూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ముట్టడించడానికి వెళ్తున్న ఉపాధ్యాయులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక ఏళ్లుగా ప్రాతినిధ్యాలు చేసినప్పటికి సమస్యలుపరిష్కారం కాలేదని ఆరోపించారు. పదిరోజుల క్రితం ప్రభుత్వానికినోటీసు ఇచ్చి పోరాటానికి పూనుకున్నామని, ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా నిమ్మకునీరెత్తినట్టుగా ఉన్న సందర్భంలో అనివార్యంగా ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చినట్టు తెలిపారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రాంచంద్, మూడ్ పుల్లయ్య, ఉపాధ్యక్షుడు జె.పుల్లయ్య, బి.రాందాస్, బి.మంగిలాల్, డి.శ్రీనివాస్, జె.గోపి, రవి, బి.రఘురాం, బి.తులసీదాస్, బి.కిషోర్‌సింగ్, అసీబ్ మియా, రమేష్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను ముందస్తుగా అరెస్టు చేసిన పోలీసులు

సకాలంలో సిలబస్ పూర్తిచేయండి

- మైనార్టీ సంక్షేమ జిల్లా అధికారి ముజాహిద్

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని మైనార్టీ సంక్షేమ జిల్లా అధికారి ఎండీ.ముజాహిద్ కోరారు. శుక్రవారం ఆయన సత్తుపల్లిలోని తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు, రికార్డులు, తరగతి, నిద్రించే గదులు, మరుగుదొడ్లు, వంటశాల, తాగునీటి ప్లాంట్, కళాశాల ఆవరణను పరిశీలించి ప్రిన్సిపాల్ వెంకట్రామయ్యకు పలు సూచనలు చేశారు.

పెండింగ్ బిల్లుల కోసం మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

కల్లూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ కల్లూరులో సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కన్వీనర్ నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ.. గత డిసెంబర్ నుంచి సెప్టెంబర్ నెల వరకు రూ.50 లక్షల వరకు బిల్లులు, వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే అందించాలని లేనిచో దసరా సెలవుల అనంతరం కోడిగుడ్డు బంద్ చేస్తామని పేర్కొన్నారు. ప్రతి నెల 5వ తేది లోగా వేతనాలు చెల్లించాలని, బీమా సౌకర్యం, ఏక రూప దుస్తులు అందించాలని కోరారు. పాఠశాలలో పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లకు నేరుగా వేతనం ఖాతలలో జమ చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతూ ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్‌రావు, కార్మికులు సత్యవతి, రేణుక, అప్పమ్మ, అలివేలు, మల్లయ్య, పిచ్చయ్య పాల్గొన్నారు.

వందపడకల ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలి



సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

మధిరరూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాల క్రితం నూతనంగా నిర్మించిన వందపడకల ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మధిరలోని సివిల్ ఆస్పత్రి ముందు సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ.. మధిర కేంద్రంగా సుమారు రూ.50కోట్ల నిధులతో నిర్మించిన వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించి పేద బడుగు బలహీనవర్గాల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. నాయకులు శీలం నర్సింహారావు, పడకంటి మురళీ, మందా సైదులు, తేలప్రోలు రాధాకృష్ణ, పెంటి వెంకట్రావ్, పుచ్చకాయల కిషోర్, అనుమోలు భాస్కర్‌రావు, మద్దాల ప్రభాకర్ పాల్గొన్నారు.

22 నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రి బతుకమ్మ ఉత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీ ప్రసన్న గణపతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 22నుంచి నిర్వహించనున్న 12వ శ్రీదేవీ శరన్నవరాత్రి బతుకమ్మ ఉత్సవాల కరపత్రాలను సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి శుక్రవారం సత్తుపల్లిలో ఆవిష్కరించారు. పట్టణ శివారులోని మనగుడి ప్రాంగణంలో ఆరోజు ఉదయం శ్రీ కనకదుర్గ అమ్మవారి కలశస్థాపన, ప్రాణప్రతిష్ఠను బ్రహ్మశ్రీ బూరుగు రవిశాస్త్రి బ్రహ్మత్వంలో నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే వచ్చేనెల 2న రావణ దహన కార్యక్రమం, 4న అమ్మవారి నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా చేపట్టనుండగా ప్రతిరోజూ అమ్మవారి దర్శనం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు చెప్పారు.

తల్లాడ తహసీల్దార్‌గా కరుణాకర్‌రెడ్డి



తల్లాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండల తహసీల్దార్‌గా టి.కరుణాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు తహసీల్దార్‌గా ఉన్న వంకాయల సురేష్ కుమార్ ఈనెల 17వ తేదీన అవినీతి నిరోధక శాఖకు పట్టుబడడంతో సస్పెండ్ అయ్యారు. ఆయనస్థానంలో చింతకాని నుంచి తల్లాడకు కరుణాకరరెడ్డికి బదిలీపై వచ్చారు.

బీసీ గురుకులంలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మదన్‌మోహన్

వైరా, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైరాలోని కొండబోలు వెంకయ్యచౌదరి మెమోరియల్ విద్యాసంస్థల భవనాల్లో నిర్వహిస్తున్న బీసీ గురుకుల బాలికల పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మినరల్‌వాటర్‌ప్లాంట్‌ను శుక్రవారం ఆక్లబ్ జిల్లా గవర్నర్ రేపాల మదన్‌మోహన్, మాజీ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ ప్రారంభించారు. వైరా న్యూలిటిల్‌ప్లవర్ స్కూల్లో సైట్ ఫర్ కిడ్స్ విజన్ కార్యక్రమాన్ని మొదట ప్రారంభించారు. ఆతర్వాత బీసీ బాలికల గురుకులంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, గురుకులం ఆర్‌సీవో సీహెచ్.రాంబాబు, ప్రిన్సిపల్ పాసంగులపాటి రాధిక, ఎస్‌ఐ పి.రామారావు, లయన్స్‌క్లబ్ నిర్వాహకులు లగడపాటి ప్రభాకర్‌రావు, ఉండ్రు శ్యాంబాబు, వై.బుచ్చి రామారావు, చింతోజు నాగేశ్వరరావు, పి.ఉపేంద్రరావు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



తల్లాడలో శుభ్రం చేస్తున్న నాయకులు



ముదిగొండలో..

తల్లాడ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సేవ పక్వాడలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లాడలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులతో కలిసి స్థానిక పురవీధుల్లో ఉన్న చెత్తను తొలిగించారు. రోడ్లుఊడ్చి శుభ్రం చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చల్లా నాగులు, స్వచ్ఛ భారత్ విభాగం కన్వీనర్ తమ్మిశెట్టి కృష్ణ, మండల నాయకులు రాయల రమేష్ చల్లా నరేష్, యద్దనపుడి శ్రీనివాసరావు, సంగీతం సాయి చంద్, చౌడా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముదిగొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడు అల్లిక శ్రీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని పలు దేవాలయాల వద్ద సేవ పక్వాడ్‌లో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ పార్టీ సభ్యులతో కలిసి రోడ్ల పక్కన ఉన్న చెత్తాచెదారాన్ని పంచాయతీ కార్యదర్శులతో కలిసి శుభ్రం చేశారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ.. బీజేపీ పార్టీ ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండి చిన్నచిన్న అవసరాలు తీరుస్తూ ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ భారత్‌గా మార్చాలని ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛభారత్‌లో పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నాయకులు వినయ్, వెంకయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రావాల్సినంత రాలే.. కొరత తీరలే..

(5వ పేజీ తరువాయి)

మొదలవుతుంది. జిల్లాలో వానాకాలం సాగు ఏప్రిల్ నుంచి మొదలై సెప్టెంబరు చివరితో ముగుస్తుంది. గతేడాది వానాకాలంలో ఏప్రిల్‌లో 94మె.ట, మేలో 270.మె.ట, జూన్‌లో 1663మె.ట, జూలై 8613మె.ట., ఆగస్టులో 13,480మె.ట., సెప్టెంబరులో 10,401మె.ట. రావడం జరిగింది. ఈఏడాది వానాకాలం సీజన్‌లో ఏప్రిల్‌లో 314మె.ట., మేలో 407మె.ట., జూన్‌లో 2292మె.ట., జులైలో 12,424మె.ట., ఆగస్టులో 8887మె.ట., సెప్టెంబరులో ఇప్పటి వరకు 4,806మె.ట వచ్చింది. ఇంకా రావాల్సిన ఎరువు జిల్లాకు రాలేదు. మొత్తంగా 41వేల మె.ట.కు గాను 30,200మె.ట వచ్చింది. ఇంకా 10వేల మెట్రిక్ టన్నులకు ఎరువు జిల్లాకు రావాల్సి ఉంది. ఇది వస్తే ఎరువుల కొరత ఉండేదికాదు. కేంద్రం నుంచి రాష్ట్రానికి, జిల్లాకు సరిపడా ఎరువుల రాకపోవడంతో యూరియాకొరత ప్రధానంగా నిలిచింది.

ఆశాజనకంగా సాగు..

ఈఏడాది జిల్లాలో సుమారు 3లక్షల ఎకరాల్లో వరి, 2.50లక్షల ఎకరాల్లో పత్తి, 10వేల ఎకరాల్లో మొక్కజొన్న, 18వేల ఎకరాల్లో పెసర, వాటితో పాటు వాణిజ్య, ఆహార, పప్పు ధాన్యాలు, కూరగాయలు, పండ్లతోటలు అన్నీ కలిపి సుమారు 6.34లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. దీంతోపాటు ఈసారి పోడు భూముల్లో కూడా రైతులు పత్తి,మొక్కజొన్న భారీగానే వేశారు. అందువల్ల ఎరువుల వినియోగం పెరిగింది. ప్రస్తుతం జిల్లాలో నెల కొన్న యూరియా డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని జిల్లా వ్యవసాయశాఖ ముందస్తు ప్రణాళిక సిద్ధంచేసింది. గతేడాది రబీలో 72వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు వినియోగించారని, ఈ ఏడాది 85వేల మె.ట. యూరియా అవసరం ఉంటుందని ప్రతిపానదలు పంపినట్టు జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. జిల్లాలో ఎరువులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామని, రైతులు కూడా ఇబ్బంది పడాల్సిన అవసరంలేదని, అవసరం మేరకే యూరియా తీసుకుని సహకరించాలని కోరారు.

ఎస్ఐకి సన్మానం

ఏన్కూరు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్లిన ఏన్కూరు ఎస్ఐ తుఫాతుల్ రఫీకి శుక్రవారం స్థానిక మసీదులో ముస్లిం మైనారిటీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయన ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. మున్ముందు ఉన్నత స్థానాలను అలంకరించాలని ఆకాంక్షించారు. మసీదు సభ్యులు నన్నేఖాన్, గౌరు ఖాన్, సయ్యద్‌పాషా, శంషుద్దీన్‌పాల్గొన్నారు

ఉద్యాన పంటలపై ఆసక్తి చూపించాలి

ముదిగొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అధిక ఆదాయాన్నిచ్చే పంటలైన ఉద్యాన పంటలపై రైతులు ఆసక్తి చూపాలని జిల్లా ఉద్యానవన పట్టుపరిశ్రమల అధికారి మధుసూదన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో సాగుచేసిన చామంతి, బంతి, లిల్లీ, గులాబీ, అరటి, ఆయిల్‌పామ్ తోటలను ఆయన సందర్శించి పరిశీలించారు. ప్లాస్టిక్ మల్చింగ్ విధానంలో సాగుచేస్తున్న ఉద్యానవన పంటల వల్ల తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ పంటలతో రైతులు నష్టపోతున్నారని, ఉద్యానవన పంటలతో అధిక ఆదాయాన్ని పొందవచ్చునని రైతులకు సూచించారు. మధిర ఉద్యానవన అధికారి విష్ణు, రైతులు పయ్యావుల రామనాథం, సైదులు, శివరాజు, కోటిరెడ్డి, నర్సింహారావు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అందరికీ అందుతున్నాయి: దయానంద్



కిష్టారంలో పనులను పరిశీలిస్తున్న దయానంద్

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.మట్టా దయానంద్ విజయకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలో కిష్టారంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్మాణంలోని తరగతి గదులు, ఆడిటోరియం పనులను పరిశీలించారు. ప్రభుత్వ బీసీ వసతి గృహంలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అదేవిధంగా పట్టణంలోని ద్వారకాపూరికాలనీలో గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు పలు సమస్యలను వివరించారు. డ్రైనేజీలు, పరిశుభ్రత, ఇందిరమ్మ ఇళ్ల వద్ద ఉన్న 33కేవీ విద్యుత్ లైన్ పరిష్కరించాలని అధికారులను కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆందోళన



సమావేశంలో ప్రసంగిస్తున్న భూక్యా వీరభద్రం

వైరా, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం ప్రకటించారు. శుక్రవారం వైరాలో మచ్చా మణి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో వీరభద్రం మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఉధృతంగా ఆందోళనలు చేస్తామని ప్రకటించారు. నాయకులు సుంకర సుధాకర్, దుగ్గి కృష్ణ,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సోషల్ మీడియా ఉపాధ్యక్షుడిగా కృష్ణ



సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ పట్టణ సోషల్ మీడియా ఉపాధ్యక్షుడిగా పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన జొన్నలగడ్డ కృష్ణ నియమితులయ్యారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆదేశాల మేరకు కృష్ణను నియమిస్తున్నట్లు సోషల్ మీడియా అధ్యక్షుడు పర్వతనేని వేణు శుక్రవారం తెలిపారు. పార్టీ కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, తన నియమించినందుకు మాజీ ఎమ్మెల్యే సండ్ర, మునిసిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్‌లకు కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

చింతకాని, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చింతకాని తహసీల్దార్‌గా శుక్రవారం విధుల్లో చేరిన బాబ్జీ ప్రసాద్‌ను బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకరంగా కలసి శాలువాతో సత్కరించారు. మండలంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మంకెన రమేష్, గురిజాల హనుమంతరావు, బొడ్డు వెంకట రామారావు, పొనుగోటి రత్నాకర్, పిన్నెల్లి శ్రీనివాస్, గడ్డం శ్రీను, నన్నక నరిసింహరావు, పర్చగాని కొండల్‌రావు, కోలేటి రాధాకృష్ణ, జానిమియా పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఫైరింగ్ పోటీల్లో న్యూలిటిల్‌ఫ్లవర్‌కు ప్రథమ బహుమతి



జైపాల్‌రెడ్డిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వైరా, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ ఆధ్వర్యంలో మణుగూర్ క్యాడెట్‌సీ.టీ8టీజీటీ డబ్ల్యూఆర్‌డీసీ11(టీ) బెటాలియన్ మణుగూర్ కేంద్రంగా నిర్వహించిన జిల్లాస్థాయి ఫైరింగ్ పోటీల్లో వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల విద్యార్థి వేమిరెడ్డి జైపాల్‌రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ అందుకున్నా రు. జైపాల్‌రెడ్డిని కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, ప్రిన్సిపల్ షాజీ మాథ్యూవ్, ఏవో ఎస్.నర్సింహారావు, ఎన్‌సీసీ ట్రైనర్ జ్యోతి అభినందించారు.

అవకాశాలను వినియోగించుకుని లక్ష్యాలను చేరండి

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న గురుకులాలలో కల్పించిన అవకాశాలను సద్వినియోగించుకుని లక్ష్యాలను చేరాలని హ్యూమన్ రైట్స్ సొసైటీ వ్యవస్థాపకులు ఆదూరి ఆనందం కోరారు. శుక్రవారం పట్టణంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాలలో మానవహక్కులు-చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని, ఉచిత విద్యతోపాటు భోజనం, వసతి కల్పిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకట్రామయ్య, సభ్యులు ఇనపనూరి మహేంద్రనాథ్, ఆదూరి మణి, చిల్లిముంత వెంకటేశ్వరరావు, పల్లిపాము డానియల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రక్తదాన శిబిరం

మధిరరూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈనెల 15వతేదీన డిప్లొమా పాసైన 2022 బ్యాచ్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా విద్యావేత్త కర్నాటి రామ్మోహన్‌రావు చేతులమీదుగా సర్టిఫికెట్స్‌ను ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ కె.సాంబయ్య, వైద్యులు డాక్టర్ రాజేష్, డాక్టర్ అనిల్ కుమార్, హెచ్‌వోడీలు వినోద్‌కుమార్, సాంబశివరావు, విజయలక్ష్మీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

